సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక 29-3-2024 15/-




# విరాళాల రాజకీయం

## డిగ్రీ తర్వాత విద్య, ఉద్యోగావకాశాలు





గీటురాయి
సహజీవన భావాల పావురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 13 హైదరాబాద్
శుక్రవారం 29 మార్చి 2024 రూ.15-00
18 రమజాన్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

**రమజాన్ మాసంలో ఎవరైనా ఒక ఉపవాసికి ఇఫ్తార్ చేయిస్తే అది అతని పాపాల మన్నింపుగా మారుతుంది.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com

## నిదురపోరా తమ్ముడా!




## లోపల...

| | | |
|---|---|---|
| న్యూ ఇండియా | ...... | 04 |
| విరాళాల రాజకీయం | ...... | 05 |
| విచక్షణా ప్రమాణం-22 | ...... | 08 |
| చరితార్థులు-2 : మౌల్వీ లియాఖత్ హుస్సేన్ | ...... | 12 |
| ఇచ్చే చేయి పైనా ఉండదు... పుచ్చుకునే చేయి క్రిందా ఉండదు | ...... | 15 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మానవ జీవితంపై తౌహీద్ ప్రభావం-2 | ...... | 20 |
| డిగ్రీ తర్వాత విద్య, ఉద్యోగావకాశాలు | ...... | 22 |
| ఇస్లాంలో మానసిక వ్యాధులకు సమగ్ర విధానం | ...... | 26 |
| దివ్యఖుర్ఆన్ అవతరించిన నెల పవిత్ర రమజాన్ | ...... | 29 |
| నాలుగక్షరాలు నోట్లో వేసుకోవడమే... | ...... | 30 |
| 'ఫిత్రా' పరమార్థం | ...... | 34 |

**చరిత్ర వక్రీకరణ..**




అబద్ధాల పుట్టకదా
రజా కారు సినిమా
నిజం చెప్పేదాక మీకు
ఇయ్యాలిర ఎనిమా!
రాజకీయ లబ్దికయి
వక్రీకరించి చరిత
పెడ్తున్నరు తాకట్టు
మనదేశపు భవిత!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# న్యూ ఇండియా

**భారత ప్రధాని** నరేంద్రమోడీ అయోధ్యలో ఒక మందిరాన్ని ప్రారంభించారు. ఆయన అబూదాబీలో కూడా ఒక గుడిని ప్రారంభించారు. ఇక్కడ దేశంలోను, విదేశాల్లోను గుడులు కడుతున్నాం. పూజాదికాలు చేసుకుంటున్నాం. కాని అదే స్వేచ్ఛ ఇతర మతాలకు కూడా ఉందని గుర్తిస్తున్నారా? ముఖ్యంగా విదేశాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఆ స్వేచ్ఛను నిరాకరించి దాడులు చేయడం వల్ల భారత ప్రతిష్ఠను దెబ్బతీస్తారన్న ఇంగితమైనా ఉందా?

గుజరాత్‌లోని విశ్వవిద్యాలయంలో రమజాను సందర్భంగా రాత్రులు చేసే తరావీహ్ నమాజు చదువుకుంటున్న విద్యార్థులపై హింసాత్మక దాడి జరిగింది. ఇంతకు దాడి ఎందుకు జరిగిందంటే, యూనివర్శిటీలో చదువుకుంటున్న కొంతమంది విదేశీవిద్యార్థులు తరావీహ్ నమాజు ఒక చోట చదువుకుంటున్నారు. వాళ్ళు నమాజు చదువుతున్నది దారికి అడ్డంగానో, అందరికీ ఇబ్బంది కలిగిస్తూనో కాదు. ఒక మూల కొందరు విద్యార్థులు నమాజు చేసుకుంటున్నారు. ఈ మధ్య దేశంలో నమాజు చేస్తున్న వారిని చూడగానే రెచ్చిపోవడం మామూలయ్యింది. ఇటీవల ఢిల్లీలో శుక్రవారం నమాజు మస్జిదు నిండిపోవడం వల్ల రోడ్డుకు కాస్త వారగా నిలబడి చేసుకుంటున్న వారిని ఒక పోలీసు అధికారి బూటు కాళ్ళతో తన్నిన వీడియో వచ్చింది. ఇది న్యూ ఇండియా. ఇక్కడ నమాజు చదువుతు కనబడితే సహించలేమన్న సందేశం దేశవిదేశాల్లో బిగ్గరగా వినిపించేలా చెబుతున్నారు. విచిత్రమేమిటంటే రోడ్డు మీద నమాజు చదవడంపై చదువుకున్నవాళ్ళు, మీడియా, మేధావులు అందరూ రోడ్డుపై అడ్డంగా నమాజులు చదవడమేమిటంటూ రాగాలు తీస్తారు. కాని ఇదే పెద్దలు రోడ్డుకు అడ్డంగా గణేష్ మండపాలు, ధార్మిక ర్యాలీలు, పూజలు వగైరాలకు ఎప్పుడు అభ్యంతరాలు చెప్పరు. ఇది న్యూ ఇండియా.

గుజరాత్‌లోని విశ్వవిద్యాలయంలో జరిగిన ఘర్షణ కాస్త నిశితంగా చూద్దాం. నమాజు చదువుకుంటున్న విదేశీ విద్యార్థులను చూసి కొందరు గొడవ చేశారు. నమాజు తర్వాత ఆ విద్యార్థులు మీ అభ్యంతరాలేమిటని అడిగారు. మాట మాట పెరిగింది. తోపులాట జరిగింది. అందులో ఒక విద్యార్థి తనతో గొడవపడుతున్న వ్యక్తికి చెంపదెబ్బ కొట్టాడు. అంతే ఆ తర్వాత అర్థరాత్రి మొత్తం గుంపు వచ్చి హింసాత్మక దాడికి దిగింది.

ఈ మొత్తం ఘర్షణకు కారణమేమిటి? ఆ విద్యార్థి చెంపదెబ్బ కొట్టడం కారణమా? లేక నమాజు చదువుతుంటే వచ్చి గొడవకు దిగడం కారణమా? ఎవరి దృష్టికోణం ఎలా ఉంటుందో జవాబుపై ఆధారపడి ఉంటుంది.

దేశంలోని జాతీయ మీడియా దృష్టిలో ఈ హింసాత్మక దాడి ఆ విద్యార్థి చెంపదెబ్బ కొట్టడం వల్లనే జరిగింది. నిజానికి మొదట్లో వచ్చిన వార్తల్లో ఈ చెంపదెబ్బ అన్నది ఎక్కడా పెద్దగా కనిపించలేదు. కాని తర్వాత ఇదే అస్సలు హింసాత్మక దాడిని సమర్థించే ఏకైక కారణంగా మారిపోయింది. కాని విదేశీ మీడియా సంస్థల దృష్టిలో ఆ విద్యార్థులు నమాజు చేయడాన్ని కొందరు భరించలేక గొడవకు దిగడమే హింసాత్మక దాడులకు కారణం. ఈ విద్యార్థులు ఎక్కడైనా ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రదేశంలో నమాజు చేసిన సూచనలు కూడా లేవు. హాస్టలు భవనం బయట నమాజు చేస్తున్నట్లు ఉంది. అల్ జజీరా, బీబీసీ సంస్థలు ఈ విద్యార్థులతో ఇంటర్వ్యూలు కూడా చేశాయి. విదేశీ విద్యార్థులకు ఇక్కడ రక్షణ లేదని, నమాజు చదివితే ఇక్కడి వాళ్ళు భరించడం లేదన్న అభిప్రాయాలు వారి నుంచి వినవచ్చాయి. గుర్గ్రాంవ్‌లో నమాజుపై జరిగిన గొడవలు అందరికీ గుర్తుండే ఉంటాయి. ఈ వార్తలన్నీఅంతర్జాతీయంగా సృష్టిస్తున్న వాతావరణం ఎలాంటిదో వేరే చెప్పనవసరం లేదు.

ఇలాంటి సందర్భంలో సాధారణంగా వైస్ చాన్సలర్ పరిస్థితిని చల్లార్చేలా మాట్లాడతారని ఎవరైనా భావిస్తారు. కాని వైస్ చాన్సలర్ నీరజా గుప్తా మాట్లాడుతూ విదేశీ విద్యార్థులు ఇక్కడి స్థానిక సంప్రదాయాలను గౌరవించడం నేర్చుకోవాలని, విదేశీ విద్యార్థులు ఇక్కడ మాంసాహారం తింటున్నారని దానివల్ల ఉద్రిక్తత పెరుగుతుందని చెప్పారు. స్థానికంగా అహ్మదాబాద్‌లో నివసిస్తున్న ప్రజలంతా శుద్ధ శాకాహారులా? గుజరాత్ ప్రజలు శుద్ధ శాకాహారులా? టైమ్స్ ఆఫ్ ఇండియాలో గతంలో వచ్చిన ఒక సర్వే ప్రకారం 40 శాతం గుజరాతీలు మాంసాహారులే. రాజస్థాన్, హర్యానా, పంజాబులతో పోల్చితే గుజరాత్ లో ఎక్కువ మంది మాంసాహారులున్నారని రాసింది. మరి గుజరాత్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ నీరజా గుప్తా స్థానిక సంప్రదాయాలను గౌరవించి మాంసాహారం తినకూడదని ఎలా చెప్పారు? జనాభాలో కొంతమంది అగ్రవర్ణాల వారు మాంసాహారం తినకపోతే అది పూర్తి ప్రజల స్థానిక సంప్రదాయమైపోతుందా? ఆమె విదేశాల నుంచి ఇక్కడికి వచ్చిన విద్యార్థులదే తప్పని చెప్పేసింది. వాళ్ళు మాంసాహారం తింటారు. నమాజు చదువుతారు. వాళ్ళది తప్పని చెప్పడానికి ఈ రెండు కారణాలు సరిపోయాయా? విదేశీ విద్యార్థులు స్థానిక సంప్రదాయాలు గౌరవించాలని చెప్పిన ఈ వైస్ చాన్సలర్ గారికి అతిథిదేవోభవ అనే భారత సంప్రదాయం గురించి ఏమీ తెలియదని కూడా మనకు అర్థమవుతోంది.

ఏది ఏమైనా గత కొంతకాలంగా వస్తున్న వార్తలను గమనిస్తే నమాజుపై సమాజంలో అసహనం ఉందన్నట్లు చూపించే వార్తలు వస్తున్నాయి. గుర్గ్రాంవ్‌లో నమాజుపై అభ్యంతరాలు, గొడవల వార్తలు గతంలో చదివాం. కాని అప్పుడే నమాజుకు తమ స్వంత భవనాలు, స్వంత స్థలాలు కేటాయించి ముస్లిములను అక్కడ నమాజు చదువుకోవచ్చని ముందుకు వచ్చి కోరిన ముస్లిమేతరులను చూశాం.

ఢిల్లీలో శుక్రవారం నమాజు చదువుతున్న వారు కొందరు రోడ్డు పక్కన చదువుతున్నారని రెచ్చిపోయి బూటుకాళ్ళతో తన్నిన పోలీసు అధికారిపై నిరసన తెలిపిన వారిలో అనేకమంది హిందు, శిక్కు సోదరులు కూడా ఉన్నారు.

గుజరాత్ యూనివర్శిటీ విషయంలో కూడా పౌరసమాజం, స్వచ్ఛంద సంస్థలు, పౌరహక్కుల సంఘాలు ముక్తకంఠంతో ఖండించారు. ఏది ఏమైనా నమాజును భరించలేని వాతావరణం దేశంలో ఉందన్నట్లు భ్రమలు కల్పించే ప్రయత్నాలు కొన్ని మతతత్వ శక్తులు చేస్తున్నాయి. ఈ శక్తులకు పోలీసు, పరిపాలనా విభాగాల్లో కూడా కొందరు సహాయపడుతున్నారు. ఢిల్లీలో నమాజు చదువుతున్న వారిపై దాడి చేసిన పోలీసు అలాంటివాడే. గుజరాత్ యూనివర్శిటీలో విదేశీ విద్యార్థులపై దాడులు జరుగుతుంటే తమాషాచూసిన పోలీసులు అలాంటి వారే. మతతత్వ శక్తుల ఈ ప్రయత్నాలను భారత లౌకిక సమాజం తిప్పికొడుతుందని ఆశిద్దాం.

అబ్దుల్ వాహెద్




# విరాళాల రాజకీయం

**చివరకు** ఎన్నికల కమిషన్ మార్చి నెలలో మూడు విడతలుగా ఎలక్టోరల్ బాండ్ల గురించిన డాటా విడుదల చేసింది.

సుప్రీంకోర్టు ఎలక్టోరల్ బాండ్లను అక్రమమైనవిగా ఇటీవల తేల్చి చెప్పేసింది. ఎలక్టోరల్ బాండ్లు ఉన్నప్పుడు ఎవరైనా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు వెళ్ళి ఎలక్టోరల్ బాండ్ కొని తనకిష్టమైన పార్టీకి ఇచ్చే సదుపాయం ఉండేది. 2018లో మోడీ ప్రభుత్వం ఈ స్కీము ప్రవేశపెట్టింది. ఈ స్కీముతో భారతదేశంలో రాజకీయ పార్టీల నిధులు, విరాళాల వ్యవస్థను ప్రక్షాళనం చేసేశామన్నారు. దాతలెవ్వరో బయటకు పొక్కకుండా దాతలు తమ పేరు బయటకు రాకుండా తమకు ఇష్టమైన పార్టీకి విరాళమిచ్చే అవకాశం కల్పించామన్నారు. అంతకు ముందు వరకు రాజకీయ పార్టీలు తమకు ఎవరు విరాళమిచ్చారో ప్రకటించవలసి ఉండేది. ఇప్పుడు ఆ బాధ లేకుండాపోయింది.

ఎలక్టోరల్ బాండ్ల వల్ల దాతల పేర్లు బయటకు రావు. అంటే ఏ పార్టీకి విరాళమిచ్చారో తెలియదు. కాని వాస్తవానికి జరిగేదేమిటంటే, ఎలక్టోరల్ బాండ్ కొని రాజకీయ పార్టీకి ఇచ్చే దాత ఎవరో పుచ్చుకున్న పార్టీకి తెలుసు. కాబట్టి ఈ చేత్తో తీసుకున్నప్పుడు ఆ చేత్తో ఇవ్వడాలు కూడా ఉంటాయనే చెప్పాలి. గమనించవలసినదేమిటంటే, ఇంతకు ముందు ప్రజలందరికీ ఈ విషయం తెలిసేది. ఇప్పుడు కేవలం ఇచ్చినవాడికి, పుచ్చుకున్న వాడికి మధ్య రహస్య లావాదేవీగా ఉంటుంది. ప్రజలకు తెలియదు. అందువల్ల ఇచ్చినవాడు ఇచ్చిన దానికి బదులుగా మరేది పుచ్చుకున్నా అది కూడా రహస్యంగానే ఉంటుంది. దీని వల్ల అవినీతి తగ్గిందా పెరిగిందా? ఏ రాజకీయ పార్టీకి ఎవరు ఎంత విరాళమిచ్చారో ప్రజలకు తెలియవలసిన అవసరం లేదా? అధికారంలోకి వచ్చిన రాజకీయపార్టీ ఏ కార్పోరేటుతో ఎందుకు రాసుకుపూసుకు తిరుగుతుందో అప్పుడే కదా తెలిసేది.

ఇప్పుడు మొదటి విడుతగా విడుదలైన డాటా విశ్లేషణ వల్ల తెలిసిందేమిటంటే కేంద్ర నిఘా సంస్థలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థలు దాడులు చేసిన తర్వాత 21 కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లను కొన్నాయి. ఎవరికి ఇచ్చి ఉంటాయో ఊహించడం కష్టం కాదు. ఆ తర్వాత ఆ దాడుల కథ ఏమయ్యిందో ఊహించడం కూడా కష్టం కాదు. వాషింగ్ మెషిన్ తన పని గొప్పగా చేస్తోంది.

ఇక్కడ గమనించవలసిన మరో వాస్తవముంది, అదేమిటంటే ఒక కార్పోరేట్ కంపెనీలో చాలా మంది సాధారణ ప్రజలు కూడా షేర్లు కొనుక్కుని ఉంటారు. అంటే ఆ కంపెనీ లావాదేవీల గురించి తెలుసుకునే హక్కు ఈ షేర్ హోల్డర్లకు కూడా ఉంటుంది. ఏ పార్టీకి విరాళమిచ్చారో తెలుసుకునే హక్కు ఈ షేర్ హోల్డర్లకు కూడా లేదా?

ఎన్నికల కమిషనర్ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తూ ఎన్నికల కమిషన్ ఎల్లప్పుడు పారదర్శకతకు పెద్ద పీట వేసిందని చెప్పారు. నిజమా??? కాని ఇక్కడ ఒక మెలిక పెట్టారు. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే దాతల పేర్లు దాచిపెట్టడం అవసరమని, లేకపోతే వారిపై వేధింపులు జరిగే అవకాశం ఉందని అన్నారు. కాని ఇదొక డొల్ల వాదన అని మాజీ ఎన్నికల కమిషనర్ ఖురైషీ నిరూపించారు. కార్పోరేట్ సంస్థలు రాజకీయ పార్టీలకు విరాళాలివ్వడం అన్నది ఎప్పటినుంచో జరుగుతూ వస్తున్నదే. ఎప్పుడూ ఎన్నడూ ఇలా విరాళాలిచ్చిన కార్పోరేట్లపై ప్రభుత్వాలు కక్ష సాధింపులకు పాల్పడిన ఉదాహరణలు లేవని ఖురైషీ చెప్పారు. కాని ఆయన ఒక వాస్తవాన్ని మరిచిపోయారు. అధికారంలో ఉన్న పార్టీ కక్ష సాధింపులకు పాల్పడవచ్చు. ఈడీ దాడులు జరగవచ్చు. ఆ తర్వాత ఎలక్టోరల్ బాండ్లు కొని ఆయా కంపెనీలు రాజకీయ పార్టీలకు ఇవ్వవచ్చు. అంటే దాతల పేర్లు దాచి పెట్టడం వల్ల ప్రభుత్వం ఇలా ఒత్తిడి పెట్టి కార్పోరేట్ల నుంచి విరాళాలు వసూలు చేయడానికి అవకాశాలు పెరిగాయి. ఎందుకంటే ఈడీ దాడులు జరిగిన కంపెనీలు తర్వాత విరాళాలు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా చెల్లించాయన్నది బయటపడే అవకాశం ఉండదు. ఏ అవినీతిని ఆపడానికి ఈ స్కీము తెచ్చామని చెబుతున్నారో, అదే అవినీతికి పెద్దపీట వేసే స్కీము ఇది. అందుకే ప్రధాన న్యాయమూర్తి ఎవరు ఎవరికి విరాళాలిచ్చారో ప్రజలకు తెలియాలని అన్నారు. కాని ఎన్నికల కమిషన్ ఇప్పుడు కూడా ఈ వివరాలు బయటపెట్టడానికి అయిష్టంగానే ఉంది. బీజేపీ ప్రభుత్వం కూడా ఈ పేర్లు బయట పెట్టడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వం ఏం కోరుతుందో అదే ఎన్నికల కమిషన్ కూడా చెబుతోంది.

## నమ్మినా నమ్మకపోయినా ? 20

# జీవరాశి జీవిత లక్ష్యం అంతర్నిర్మితం

సమస్త జీవరాశికి తమ పుట్టుక లక్ష్యం ఏమిటో దేవుడు ముందే తెలియజేశాడు. ఈ విషయాన్ని జీవరాశి మనసుల్లో అంతర్గతంగానే ప్రోదిచేయబడింది. అది తేనెటీగ లేదా సూర్యుడు, చంద్రుడు లాంటి చేతనాచేతన సృష్టిరాశి అయినా వాటి సృజన ఉద్దేశ్యాన్ని తెలియజేస్తూ వాటికి మార్గానుసరణ చేశాడు దేవుడు.

మన సృష్టికర్త, ఈ విశ్వ సృష్టికర్త ఒక్కడే, నమ్మినా, నమ్మకపోయినా అన్ని యుగాలలో మానవులందరికీ తమ సృష్టి యొక్క ఉద్దేశ్యం మరియు మానవులు తమ విధివిధానాలను నెరవేర్చే మార్గాన్ని పరంపరానుగతంగా ఆయన తన గ్రంథాలూ, ప్రవక్తల ద్వారా తెలియజేస్తూనే వచ్చాడు దేవుడు.

సత్యం సదా ఒక్కటే. నిజం లేదా నిజమైన భావజాలం ఎన్నటికీ మారదు, ఇది ప్రపంచం ఆది నుండి అంతం వరకు ఒకే విధంగా ఉంటుంది, దేవుని భావజాలం యొక్క మూలం ఒక్కటే, సృష్టికర్త నిత్య సజీవుడు, మానవ సృష్టిలోని మొదటి వ్యక్తి నుండి చివరి వ్యక్తి వరకు ఆయన చూపే ప్రేమ సమానంగా ఉంటుంది. సృష్టి ఆది నుండి మానవులందరికీ ఆయన పంపిన భావజాలం లేక సిద్ధాంతం ఉత్తమంగానే ఉంది. ఆ సిద్ధాంతం సదా ఒకటిగానే ఉంది, ఉంటుంది.

నమ్మినా నమ్మకపోయినా మానవ స్వభావం ఎప్పటికీ మారదు, కాబట్టి ఒక వ్యక్తికి ఏది మంచో అది ఇతరులకు కూడా మంచిదే. వ్యక్తి మారినంత మాత్రాన ఈ 'మంచి' అన్నదాని నైజం మారదు. ప్రాథమికంగా నిజమైన భావజాలం ఒక్కటే, ఇది మారేది కాదు. ఈ ప్రపంచంలోకి మానవులు వచ్చి పోయేవారే, దేవుడు వారికి అందించిన భావజాలం సదా ఒక్కటే.

మిథ్యావాదాలు మరో తప్పుడు సిద్ధాంతానికి దారితీస్తూ ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. అంటే, ఈ మిథ్యా సిద్ధాంతాలు ఇతర వ్యక్తులను దోపిడీ చేయడానికి సదా మారుతూనే ఉంటాయన్నది సుస్పష్టం. నమ్మినా నమ్మకపోయినా ఇది ఆయా మిథ్యావాదాల నైజం.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

మోడీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చింది. అవినీతిని అంతం చేస్తామన్నారు. నల్లధనాన్ని తెస్తామన్నారు. దశాబ్దం తర్వాత ఇప్పుడు అవినీతి దేశంలో ఎలా ఉందో ఎవరికి వారే అంచనా వేసుకోవచ్చు. నోట్లరద్దు, జియస్టీ, రఫాయల్ ఇలా అనేక ఆరోపణలు ఒకటి తర్వాత ఒకటి వస్తూనే ఉన్నాయి. కాని దేశంలో గోదీ మీడియాగా పేరుపడిన జాతీయ మీడియా హిందూ ముస్లిం డిబేట్లతో కాలం వెళ్ళబుచ్చుతోంది. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో ఇప్పుడు అవినీతి పెద్ద స్థాయిన జరిగిన ఉదాహరణ మరొకటి ముందుకు వచ్చింది.

అవినీతి అనేది నిజానికి భారత రాజకీయాల్లో ప్రధాన సమస్యగా ఎప్పటి నుంచో ఉంది. యుపియే ప్రభుత్వం కుప్పకూలడానికి కారణం అవినీతి ఆరోపణలే, అన్నింటికన్నా ముఖ్యంగా ఈ అవినీతి ఆరోపణలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళిన మీడియా వల్లనే యుపియే ప్రభుత్వం గద్దె దిగింది. అంతకు ముందు రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1989లో ఓడిపోడానికి కారణం కూడా అవినీతి ఆరోపణలే. అప్పుడు కూడా మీడియా ప్రధాన పాత్ర పోషించింది. విచిత్రమేమిటంటే ఈ అవినీతి ఆరోపణలపై విచారణలు ఇప్పటికి కూడా సాధించింది ఏమీ లేదు. కాని మీడియా ప్రచారం రెండు ప్రభుత్వాలను కుప్పకూల్చింది. కాని విచిత్రమేమిటంటే, 2014 తర్వాతి నుంచి మీడియా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మానేసింది. ప్రతిపక్షాలను ప్రశ్నించడం, విమర్శించడమే మీడియా ప్రధాన కర్తవ్యంగా మారిపోయింది. మీడియాలో వచ్చిన ఈ మార్పుకు కారణాల వెనుక కూడా అవినీతి లేదా?

బీజేపీకి విరాళాలిచ్చిన దాతలెవ్వరో పేర్లు బయటపెట్టడానికి పార్టీ ఇష్టపడడం లేదు. దీని అర్థమేమిటి? ఈ దాతలకు ఇచ్చిన విరాళాలకు తగిన ప్రతిఫలాలు లభించాయా? నల్లధనాన్ని తెల్లగా ఉతికి ఆరేసే స్కీము అన్న ఆరోపణల్లో నిజం లేదా?

ఇప్పుడు బీజేపీ నుంచి అనేక వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తం 20వేల కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లలో కేవలం 6 వేల కోట్ల రూపాయలే బీజేపికి లభించాయని అమిత్ షా అబద్దాలు చెప్పి కళ్ళకు గంతలు కట్టాలని చూశారు. బీజేపికి మొత్తం 8,252 కోట్ల రూపాయలు లభించాయి. మొత్తం బాండ్ల విలువ 20వేల కోట్లు కాదు, 16,492 కోట్లు మాత్రమే. అంటే ఇందులో సగం బీజేపీకే లభించాయన్న మాట. మిగిలిన సగం దేశంలోని 20 పై చిలుకు ఇతర పార్టీలకు లభించాయి.

నిజానికి రాజకీయ పార్టీలకు లభించే విరాళాల్లో ఎలక్టోరల్ బాండ్లు ఒక పద్ధతి మాత్రమే. పెద్ద కార్పోరేట్లు దాతలుగా విరాళాలిస్తున్న ఎలక్టోరల్ ట్రస్టులున్నాయి. వాటి నుంచి లభిస్తున్న విరాళాలు వేరే ఉన్నాయి. ఇవి కాకుండా నగదు రూపంలో బ్యాంకు ట్రాన్స్ఫర్ రూపంలో వస్తున్న విరాళాలున్నాయి. స్క్రోల్ లో ధన్య రాజేంద్రన్, సుప్రియా శర్మలు రాసిన వ్యాసం ప్రకారం ఈ మూడు పద్ధతుల్లో చూస్తే బీజేపికి 2018 నుంచి 2023 మధ్యకాలంలో మొత్తం 12,930 కోట్ల రూపాయలు లభించాయి.

వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే మనకు చాలా విషయాలు లభిస్తాయి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేయాలంటే డబ్బు కావాలి. డబ్బు ఎవరి దగ్గర ఉంటుందో వారికి గెలిచే అవకాశాలు పెరుగుతాయి.

ఎలక్టోరల్ బాండ్ల వంటి స్కీముల వల్ల అధికారంలో ఉన్న పార్టీకి సానుకూలత పెరుగుతుంది. విరాళాలివ్వని కంపెనీలపై ఈడీ వంటి సంస్థలతో ఒత్తిడి తీసుకువచ్చి బలవంతంగా విరాళాలు వసూలు చేయవచ్చు. విరాళాలిచ్చింది ఎవరో బయటపడదు కాబట్టి ఈ ఒత్తిళ్ళు, బలవంతపు వసూళ్ళ గురించి బయటకు తెలియదు.

ఇతర పార్టీల కన్నా అత్యధికంగా విరాళాలు సేకరించడం ద్వారా డబ్బులు వెదజల్లి ఎన్నికల్లో గెలిచే అవకాశాలు పెరుగుతాయి.

ఏ కార్పోరేట్ల విరాళాలతో గెలిచారో వారికి ప్రయోజనాలు కట్టబెట్టే ప్రయత్నాల్లో ప్రజా సంక్షేమాన్ని అటకెక్కిస్తారు. అందువల్లనే సంపన్నులు మరింత సంపన్నులుగాను, పేదలు మరింత పేదలుగాను మారుతున్నారు.

ప్రజలు ఈ రాజకీయాలను, అవినీతి కార్యకలాపాలను గమనించకుండా ప్రజలను పక్కదారి పట్టించడానికి మతతత్వపు నినాదాలతో రెచ్చగొడతారు, సిఏఏ, ఎన్నార్సీ, లవ్ జిహాద్ ఇలా చేసే ప్రయత్నాలన్నీ ప్రజలను అసలు సమస్యల నుంచి పక్కదారి పట్టించడానికి చేసే ప్రయత్నాలే. ఈ ప్రయత్నాలకు మీడియా పూర్తి మద్దతు పలుకుతూ ప్రభుత్వ నెరేటివ్‌ను ముందుకు నడపడానికి సహాయపడుతోంది.

ఇది ఇలాగే కొనసాగితే భారత ప్రజాస్వామ్యం ఎక్కడి నుంచి ప్రారంభమయ్యింది? ఎటు పోతుందన్న? ప్రశ్నలు సమాజ శ్రేయోభిలాషులు అందరు ఆలోచించవలసిన ప్రశ్నలు. ✤

అధ్యాయం -8

22

# విచక్షణా ప్రమాణం

ఎస్.ఎమ్. మలిక్

## 2. సామ్రాజ్యంతో భేటీ

### బువైబ్ పోరాటం

వంతెన పోరాటం తరువాత మహనీయ ముస్నా సహాయార్థం ఇద్దరు కమాండర్ల ఆధ్వర్యంలో మరిన్ని సేనలు పంపారు మహనీయ ఉమర్ ఫారూక్ (రజియల్లాహు అన్హు). ఇప్పుడు ఆయన వద్ద ఉన్న సేన బలగం దాదాపు 18 వేలయి పోయింది. సేన ఫరాత్ నది ఒడ్డున బువైబ్ అన్న చోట క్యాంపు వేసింది. ఈ పోరుకు రుస్తుమ్, ఈరానీయుల సేనాని, మహ్రాన్ అనే జనరల్ని ఎన్నుకున్నాడు. మహ్రాన్ అరబ్బుల్లో పెంపకం పొందిన వ్యక్తి. మహ్రాన్ నదికి ఆవల ఒడ్డున పశ్చిమాన, దాదాపు ఒక లక్షా ముప్పై వేల సేనతో దిగాడు. ముస్నా అతన్నే ఈవలకు రావాలని కోరుకున్నారు. ఆ పైన ఈరానీయులు నది దాటి వరుసలు దీరారు.

ముస్లిమ్ సేనల నియమానుసారం వారి సేనాని మూడు మార్లు 'అల్లాహు అక్బర్' అని నినదిస్తాడు. అది సేనకు సన్నద్ధులవడానికి సంకేతం. అలా పోరు మొదలయి భీకరంగా సాగింది. అమరగతి పొందాలన్న ఉత్సాహం, ఉద్వేగంతో ముందుకు ఉరకలు వేసిన సైనికులు నిర్భయంగా పోరాడి అమరగతిని కావలించుకున్నారు.

ఈ పోరును బువైబ్ పోరాటం అని నామకరణం చేశారు చరిత్ర కారులు. అతి భయంకరమయిన పోరు అది. ఈరానీయులు జాతీయ విద్వేషంతో మండుతూ పోరాడితే ఇస్లామీయ యోధులు దైవ ప్రసన్నతా ఉద్వేగంతో, అమర గతి ఆకాంక్షతో తమ్ము తాము సమర్పించుకున్నారు. వారి సేనాని ముస్నా తన గుప్పెడు మంది సేనతో ఈరానీయుల పైన తుఫానులా క్రమ్ముకున్నారు. అటునుంచి శత్రు బలాన్ని ఛిన్నాభిన్నం చేస్తూ ఈరానీయుల మధ్యకు పోయి విరుచుకు పడ్డారు. అంతే ఈరానీయులకు పరారవడం తప్ప గత్యంతరం లేక పోయింది.

వారు వంతెన వైపునకు పరిగెత్తారు, ముస్నా తన సైనికుల్ని వంతెన పడగొట్టమని నిర్దేశించారు. వంతెన లేకపోవడంతో వారు వెనుదిరిగారు. అక్కడ మరో కమాండర్ జరీర్ బిన్ అబ్దుల్లా వారిని అందుకున్నారు. అప్పుడు సంహారానికి గురయిన ఈరానీయ సైనికులు దాదాపు ఒక లక్ష మంది ఉంటారని చరిత్ర కారులు అంచనా వేశారు, అక్కడే ముస్లిమ్ యోధులు వంద మంది మాత్రమే! చరిత్ర కారుల ప్రకారం ఇంత పెద్ద సంఖ్యలో కళేబరాలు మరే పోరులోనూ

కానరాలేదు. ఆ మైదానంలో ఎముకల గూళ్ళ వల్ల బువైబ్ పోరాటాన్ని చాలా కాలం వరకు గుర్తు చేసుకుంటూ ఉన్నారు జనం.

## కాదిసియ ఘర్షణ

బువైబ్ పోరు తరువాత ఈరాన్‌లో అంతటా శోకాలాపనలు వ్యాపించాయి. రాజ్యంలోని మంత్రులు, నాయకులు ఓ చోట, తమ మతం అగ్ని పూజా ప్రధానమయిన జోరాష్ట్రియానిజంను కాపాడుకునే మార్గాలను అన్వేషించడానికి సమావేశమయ్యారు. మరో మీటింగు రాజధాని మదాయన్‌లో ఏర్పాటు చేశారు. అక్కడ కూడా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కడకు అప్పుడు రాజపీఠాన్ని ఆక్రమించుకున్న గతించిన రాజు కూతురును అధికారం నుంచి తొలగించి ఆమె తమ్ముడు యజ్ది గర్ద్, పదహారేళ్ళ నవయువకుణ్ణి తఖతు నెక్కించారు.

ఈరానీయుల ఈ విపత్కర పరిస్థితిలో సదా జగడమాడే ఇద్దరు సేనా నాయకులు ఏకమయి పోరాటానికి సన్నాహాలలో నిమగ్నమయ్యారు. ఈ సారి అరబ్బుల్ని సర్వ నాశనం చెయ్యాలని సంకల్పించుకున్నారు. ఈ సన్నాహాలను గురించి తెలిసి ఇప్పుడిప్పుడే ఇస్లామీయ యోధులకు లోబడి పోయిన ఇరాక్ సరిహద్దు ప్రాంతాల్లోని గత పాలకుల నమ్మినబంట్లు, ఇస్లామీయ పాలకులకు తిరుగుబాటుకు ఒడిగట్టారు.

మహనీయ ఉమర్ (ర) ఈ పరిస్థితుల్ని క్షుణ్ణంగా పరిశీలించి వారి ఈ ఎత్తుగడలకు విరుగుడు కనిపెట్టడానికి ఉద్యుక్తులయ్యారు. ఆయన తొలుత రంగంలో ఉన్న తన సేనాధిపతిని ఆదేశించి సేనను వెనక్కి అరేబియా సరిహద్దుల్లోకి రప్పించారు. ఆ తరువాత ముందడుగు సన్నాహాలు చేయసాగారు. అరేబియా అంతటి నుంచి ముస్లిమ్ సముదాయంలోని భిన్న సామర్థ్యాలు గలవారినీ నిపుణుల్నీ మదీనా రప్పించారు. వారిలో అశ్వారూఢులు, సమర్థవంతులయిన వక్తలు, మేధావులు, ఆలోచనాపరులూ ఉన్నారు.

విభిన్న అరేబియా ప్రాంతాల నుంచి ఇస్లామీయ సేనలూ వచ్చి చేరాయి. హిజ్రీ 14వ సంవత్సరం, విచక్షణా ప్రమాణంగా పేరుగన్న మహనీయ ఉమర్ హజ్జ్ చేసి తిరిగి వచ్చినప్పటికి వీరంతా వచ్చేసి ఉన్నారు. ఆయన స్వయంగా ఈరానీయులను ఎదుర్కొనేందుకు వెళ్ళాలని కోరుకున్నారు. కాని సలహామండలి తీర్పు మేరకు రాజధానిలో మకాం చేశారు.

## యుద్ధ రంగం

సేనకు ప్రధాన సేనాధిపతిగా సఅద్ బిన్ అబీ వక్కాస్‌ని నియమించారు. ఆయన రణ తంత్రంలో ఆరితేరిన వ్యక్తి. ఆ పైన మైదానంలో ప్రథమ బెటాలియన్‌కు కమాండర్‌గా మహనీయ తల్హాని, కుడి పక్షాన మహనీయ జుబైర్‌ని, ఎడమ పక్షాన మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌ని కమాం డర్లుగా నియమించారు. మహనీయ ఉమర్ ఫారూక్, తాను స్వయంగా యుద్ధ వ్యూహం తయారు చేసి ఇచ్చారు. యుద్ధ మైదానం, కాదిసియా నుండి రాజధాని వరకు 20 స్థావరాలు ఏర్పరచి అనుక్షణం పరిణామాలను గురించి తెలుసుకునే ఏర్పాటు చేశారు. రణరంగం నుండి మదీనా వరకు, ఒక్కో స్థావరం నుంచి తరువాతి స్థావరం వరకు సమాచారం మోసుకుని దౌడు తీయించే రౌతుల్ని ఏర్పరచి, ఖలీఫా అనుక్షణం యుద్ధ మైదానాన్ని కళ్ళారా చూస్తున్నట్లు, తగిన ఆదేశాలు జారీ చేసే వీలు కల్పించడం జరిగింది!

కాదిసియా చేరిన తరువాత, వంతెన పోరులో కలిగిన గాయాల వల్ల మహనీయ ముస్నా పరమపదించారని తెలుసుకుని బాగా బాధపడ్డారు, మహనీయ సఅద్ ఆయన సైనిక దళాలు.

## సందేశం ప్రథమం

రణరంగం వివరాలు తెలుసుకున్న మహనీయ ఫారూక్, కొందరు మేధావుల్ని, యుద్ధానికి ముందు ఈరాన్ రాజ దర్బారుకు పంపి ఇస్లామ్ సందేశాన్ని అందజేయవలసిందని పురమాయించారు. రాజ దర్బారు ఠీవిని ఏ మాత్రం ఖాతరు చేయని సాదా సీదా ముస్లిమ్ యోధులు దర్బారులోకి వెళ్లి ఇస్లామ్ సందేశాన్ని చేరవేసి ఇస్లామ్‌ను స్వీకరించి ధర్మ గ్రంథాన్ని అనుసరించాలనీ లేదా ఇస్లామీయ రాజ్యానికి కప్పం కట్టి ప్రభుత్వ రక్షణ పొంది సామంతులుగా శాంతి యుతంగా మెలగవచ్చనీ తెలిపారు. లేకపోతే యుద్ధం తప్ప గత్యంతరం లేదని చివరి మాటగా చెప్పారు.

యువకుడయిన రాజుకు ఎనలేని ఆగ్రహం కలిగింది. అయినా అతను ఎంతో నిగ్రహంతో, "మీకు ఏవో కొన్ని చోట్ల యాధృచ్ఛికంగా విజయం లభించినందుకు మీరు దానికి మోసపోయి విర్రవీగుతున్నారు. మాతో పోరు తలంపును మరచిపోండి" అని కాస్త వెటకారంగా అన్నాడు. ఇది విని బృందం లోని ఓ సభ్యుడు ముగైరా(ర) బిన్ జిరారా కోపం పట్టలేక అన్నారు, "మేము అరబ్బు శ్రేష్ఠ జనులం, అధిక ప్రసంగం ఇష్టపడము, కాని ఒకటి వినండి. అరేబియాలో

దైవప్రవక్త(స) వచ్చిన తరువాత తన బోధనా శిక్షణల ద్వారా అరేబియా అంతటినీ మార్చి వేశారు. మేము ఇక్కడ మా చరిత్రను ఏకరువు పెట్టడానికి రాలేదు. ప్రవక్తశ్రీ సందేశాన్నే అందజేస్తున్నాము'' అని చెప్పి ఇస్లామ్ సందేశాన్ని వినిపించారు. ఆపైన ఇలా పలికారు, ''దీనికి మూడు కోణాలు, మీరు ఇస్లామ్ స్వీకరించి మా సోదరులవండి. లేదా మాకు కప్పం కట్టి మా సంరక్షణ పొందండి లేదా కరవాలం పట్టి మైదానంలోకి దిగండి, అంతే.'' దానికి చక్రవర్తి ఆగ్రహంతో ఊగిపోయాడు, ''మీరు రాయబారులు అయినందుకు వదలి పెడుతున్నాను, వెళ్ళండి, మీ నాయకునికి చెప్పండి, రుస్తుమ్ వస్తున్నాడు అతను మిమ్మల్ని అందరినీ కాదిసియా కందకంలో పూడ్చి పెడతాడు.''

## సంధి కోరిన రుస్తుమ్

రుస్తుమ్ వద్ద అప్పుడు లక్షా ఇరవై వేల సైన్యం ఉంది. ఒక రాత్రి వేళ ఇస్లామీయ సేనాని మహనీయ సఅద్ నియమించిన గూఢాచారి తలైహాకీ- రుస్తుమ్ సైనిక అధికారికీ మధ్య పోరు జరిగి సైనికాధికారి హతమయ్యాడు. వారు మరో అధికారిని పంపారు. అతను వివేచనాపరుడు, ఆలోచించాడు, మరణించిన అధికారి ఎంతో అనుభవం ఉన్న వాడు. అతన్ని ఓ మామూలు సైనికుడు ఒక్క క్షణంలో హతమార్చాడంటే ముస్లిములకు దైవిక సహాయం ఉందని ఊహించాడు. అలా అతన్ని దైవం సన్మార్గ దిశగా సద్బుద్ధి ప్రసాదించాడు. అతను ఇస్లామ్ స్వీకరించాడు. అతని ద్వారా ఈరాన్ రక్షణ విభాగం శక్తి సామర్థ్యాలు పూర్తిగా అవగతమయి పోయాయి సేనాని సఅద్‌కు.

రుస్తుమ్ బహుశా ఇదంతా గమనించి కాబోలు, సంధి సంప్రదింపులకు ఎవరినయినా పంపవలసిందని సందేశం పంపాడు. అప్పుడు మహనీయ సఅద్ మహనీయ ముగైరా బిన్ షుఅబాని రాయబారిగా పంపారు. రాజదర్బారులోని ఠీవి దాని పటాటోపానికి ఏ మాత్రం జంకని మహనీయ ముగైరా తన అతి సాధారణ దుస్తులతో ఒరలో కరవాలం, మరో వైపున విల్లంబులు ధరించి నిర్భయంగా నేరుగా రుస్తుమ్ వద్దకు వెళ్లి కూర్చున్నారు. అంతే, బంట్రోతులు దిగ్గున వచ్చి ఆయన్ని అక్కడి నుంచి లేపసాగారు. ఆయన లేచి దర్బారులోని అధికారులను సంబోధించి ఇలా అన్నారు,

''నేను స్వయంగా రాలేదు, మీరు పిలువగా వచ్చాను, పిలువనంపిన అతిథి పట్ల ఈరానీయుల సభ్యత ఈ విధంగానే ప్రవర్తించమంటుందా? అలా అయితే దానికి ఇవే నా సలాములు! ఇస్లామీయ సంస్కృతీ సభ్యతలు మానవునికి మరో మానవుని దాస్యం నుంచి విముక్తిని అనుగ్రహించింది.'' ద్విభాషి అనువాదం చేయగానే అందరూ కాస్సేపటికి సిగ్గిల్లి తలలు వంచుకున్నారు. ఆపైన రుస్తుమ్ స్వయంగా లేచి వచ్చి మహనీయ ముగైరాని తీసుకునిపోయి తన ప్రక్కన కూర్చో బెట్టుకున్నాడు.

## కొండను ఢీకొనడం!

కాస్సేపటి తరువాత రుస్తుమ్ ముగైరా వద్ద ఉన్న అంబులను చూపి ''వీటి వల్ల ఏమిటి ఒరిగేదీ?'' అన్నాడు. దానికి ముగైరా, ''అది దీన్ని ప్రయోగించే చేతుల పైన ఆధారపడి ఉంటుంది'' అంటూ తన రెండు చేతులు రుస్తుమ్ వైపునకు ఎత్తారు. రుస్తుమ్ వెనక్కి తగ్గాడు, ముగైరా చిన్నగా నవ్వారు. ఇంకా కాస్సేపటికి ఒరను చూపించి ''ఎంత మాసిపోయిందో!'' అన్నాడు రుస్తుమ్. మహనీయ ముగైరా, ''అసలు కావలసింది ఒర కాదు, కరవాలం. దానికి ఇప్పుడిప్పుడే పదను పెట్టడం జరిగింది!'' అని కొట్టి పారేశారు. ఆ తరువాత అసలు విషయం మీదికి వచ్చారు.

రుస్తుమ్ చెప్ప సాగాడు, ''బుద్ధిమంతుడివి, ఇక్కడ చూసినదంతా మీ నాయకునికి చెప్పి కొండను ఢీకొనవద్దని సలహా ఇవ్వు''. ముగైరా తన కరవాలం పైన చెయ్యి పెట్టి, ''మీరు ఇస్లామ్ స్వీకరించడానికో లేదా కప్పం కట్టి మా రక్షణ పొందడానకో అంగీకరించకపోతే ఇక దీని ద్వారానే తీర్పు జరుగుతుంది! అప్పుడు తెలిసిపోతుంది ఎవరు కొండను ఢీకొన్నారో!!'' అని అన్నారు.

ఆ సంప్రతింపులకు ఫలితం లేకపోయింది, మహనీయ ముగైరా తిరిగి వచ్చేశారు.

## మార్కోలు

కడకు హిజ్రీ 14వ సంవత్సరం, ముహర్రమ్ నెలలో మహనీయ ఉమర్ ఫారూక్ (ర) ఆదేశం మేరకు ఇరు సేనలు ఢీకొన్నాయి. జుహర్ నమాజ్ తరువాత మహనీయ సఅద్ (ర) మూడు మార్లు తక్బీర్ నినాదం చేశారు, దాడి జరిగింది. ప్రారంభంలోనే ఓ సైనికుడు ఓ రాకుమారుడు హుర్ముజ్‌ని లోబరచుకుని పట్టి తెచ్చారు, అతన్ని మహనీయ సఅద్(ర)కు దగ్గర శిబిరంలో బంధించారు. అది గమనించిన ఓ ఈరానీ సేనాధికారి ముస్లిములను ఛాలెంజ్ చేశాడు. వెంటనే అమ్ర్ బిన్ మఅదీ ముందుకు వెళ్లి బల్లెం విసిరారు, అంతే, అది

నేరుగా అతని గుండెను చీల్చుకు పోయింది!

రుస్తుమ్ ఈరానీయుల బలహీనతను పసిగట్టి ఏనుగుల్ని ముందుకు ఉరికించాడు. ముస్లిమ్ యోధుల గుర్రాలు వెనక్కి పరిగెత్త సాగాయి. మహనీయ సఅద్, ఏనుగుల్ని ఆపమని కమాండర్ తలైహాని ఆదేశించారు. ఆయన తన సైనికులతో బల్లాలు పట్టుకుని ఏనుగుల పైకి లంఘించారు. వాటినెక్కిన వారిని తమ బల్లాలతో గురిచూసి పడదోయ సాగారు. ఆ పోరు రాత్రి చీకటి పడే వరకు సాగింది. అది కాదిసియా తొలి పోరు.

## ముగింపు

లోగడ మహనీయ ఖాలిద్ బిన్ వలీద్ తీసుకు వెళ్లిన ఎనిమిది వేల సైనికులు, ఖలీఫా ఉమర్ (ర) ఆదేశానుసారం మరుసటి రోజు రణరంగం లోకి వచ్చేసింది. అప్పుడు ఆ దళం నాయకులు వందలకొద్దీ ఒంటెల పైన పెద్ద పెద్ద దుప్పట్లు కప్పి భయంకర రూపంలో ప్రవేశ పెట్టారు రంగంలో. అవి ఎటు వెళ్ళినా ఈరానీయుల గుర్రాలు పారి పోసాగాయి. ఇది ఈరానీయుల ఏనుగులకు సమాధానం కాబోలు! ఆ తరువాత మూడు రోజుల పాటు పోరు కొనసాగింది. ఈరానీయుల మహా యోధుల్ని హతమార్చారు ముస్లిమ్ యోధులు. వారి పేరుగన్న సేనాని రుస్తుమ్ ఓ సాధారణ సైనికుని చేత హతమయ్యాడు. శత్రువుల సిపాయిలు 35 వేల మంది హతులయ్యారని అంచనా. ముస్లిమ్ యోధులు సయితం ఎనిమిది వేల మంది అమర గతులయ్యారు.

ఈ యుద్ధం పట్ల మహనీయ ఉమర్ (ర) ఎంతగానో చింతిల్లుతూ ఆత్రుతతో గడిపేవారు. పోరు ముగిసిన సమాచారం అందిన తరువాత ప్రతి రోజూ రాజధాని మదీనా నగర పొలిమేరలో ఎదురు చూస్తూ ఇరాక్ దారిలో బహు దూరం నడిచేవారు. లేదా సందేశ వాహకుని కొరకు వేచి చూసేవారు. వేగంగా పరిగెత్తే ఒంటె పైన సందేశ వాహకుడు వచ్చిన రోజున మదీనా నగర పొలిమేర నుంచి అతని వెంట పరిగెత్తుతూ పరిస్థితులను గురించి విచారిస్తూ వస్తున్నారు. అతను కూడా అడిగినదంతా తెలుపుతూ వచ్చాడు. నగరంలో ప్రవేశించగానే జనం ఖలీఫాను చూసి "అస్సలాము అలైకుమ్, అమీరుల్ మూ'మినీన్" అని అభివాదం చేయ సాగారు. అది గమనించి సందేశ వాహకుడు, "అమీరుల్ మూ'మినీన్, దైవం కరుణించుగాక! నాకు ముందే చెప్ప లేదేమిటీ, నేను దిగి సలామ్ చేసుకునే వాణ్ణి కదా, మా సేనాని ఇచ్చిన విజయ సందేశం మీకు సమర్పించుకునేవాణ్ణి కదా" అన్నాడు. ఆయన(ర) దానికి, ఇలా అన్నారు, "ఏమీ పర్వా లేదు, మాట కొనసాగనివ్వు." ఆ తరువాత బహిరంగ సభలో విజయ పత్రం చదివి వినిపించారు. ✤


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.


బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# 'చరితార్థులు'-2



# మౌల్వీ లియాఖత్ హుస్సేన్

## (1852-1920)

39



భారత జాతీయోద్యమానికి అంకురార్పణగావించిన 'బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం'లో ఆంగ్లేయుల చర్యల పట్ల ఆగ్రహించి సింహంలా గర్జిస్తూ ఉద్యమించి 'మగవాళ్ళల్లో సింహం' (A Lion Amongst Men) గా సహచరుల ప్రశంసలు అందుకున్న మౌల్వీ లియాఖత్ హుస్సేన్ 1852లో బీహార్ రాష్ట్రం పాట్నాలో జన్మించారు. ఆయన తండ్రి మీర్ అలీ ఖాన్. బ్రతుకు దెరువు కోసం పాట్నా నుంచి కలకత్తా వచ్చి స్థిరపడ్డారు. ఆంగ్లేయ ప్రభుత్వ చర్యలను ప్రశ్నిస్తూ 1902లో సతీష్‌చంద్ర ముఖర్జీ ఏర్పాటు చేసిన 'డాన్ సోసైటీ' (Anti-circular Society), 1905లో సచీంద్ర ప్రసాద్ బసు ఆరంభించిన 'యాంటీ సర్క్యులర్ సోసైటీ' (Anti-circular Society)ల కార్యకలాపాల్లో మౌల్వీ చురుగ్గా పాల్గొన్నారు. బెంగాలులో పొటమరిస్తున్న జాతీయవాద భావజాలం ప్రమాదకరంగా భావించి హిందూ-ముస్లింల మధ్యన విఘాతాన్ని సృష్టించేందుకు లార్డ్ కర్జన్ 1905లో జారీ చేసిన బెంగాల్ విభజన ఉత్తర్వుల వ్యవహారం 1906 ఆరంభంలో ప్రజల ఎరుకలోకి వచ్చింది. ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా బెంగాల్ ప్రజానీకం భగ్గుమంది. బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ ఆరంభమైన ఉద్యమంలో మౌల్వీ క్రియాశీలక పాత్ర నిర్వహించారు. మంచి వక్తగా పేర్గాంచిన ఆయన కలకత్తా స్థావరంగా కార్యకలాపాలను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఉనికిలోకి వచ్చిన 'స్వదేశీ ఉద్యమం'లో కూడా మౌల్వీ చురుగ్గా పాల్గొన్నారు. స్వదేశీ ఉద్యమాభివృద్ధికి స్వయంగా 'స్వదేశీ ఉద్యమ స్వచ్ఛంద కార్యకర్తల సంస్థ' ఏర్పాటు చేశారు. ఆయన ఉత్తేజపర్చే ప్రసంగాలు చేయడమే కాకుండా, ఆంగ్ల ప్రభుత్వ చర్యలను విమర్శిస్తూ, ఐక్యంగా పోరాడాల్సిందిగా ప్రజలకు పిలుపు ఇవ్వడం తన రోజువారి కార్యక్రమాలుగా మార్చుకున్నారు. బెంగాల్‌లోని హిందూ-ముస్లింలు ఒకరికొకరు సోదరులుగా ప్రకటించుకుంటూ 'రాఖీలు' కట్టుకోవాలని పిలుపునిచ్చిన ఆయన బెంగాలి మాసం Asvinలో ప్రతి ఏడు క్రమం తప్పక రాఖీపండుగ నిర్వహించారు. ఆంగ్లేయులను వ్యతిరేకించడం ముస్లింల విధి అని ప్రకటిస్తూ Muslims do not go Astray and do not Turn Infidels శీర్షికన కరపత్రం ప్రచురించి పంచారు. అందుకు గాను 1907 జూన్ 12న ఆంగ్ల ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి మూడు సంవత్సరాల జైలుశిక్ష విధించింది. ఆ తరువాత కూడా ఆయన పలుమార్లు నిషేధాలకు- నిర్బంధాలకు గురయ్యారు. 1911లో బెంగాల్ విభజన రద్దయింది. జాతీయోద్యమంలో మితవాద ధోరణి నచ్చని మౌల్వీ ఆ తరువాతి కాలంలో సహాయ నిరాకరణ ఉద్యమం, మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతాలతో కూడా ఏకభవించలేదు. 'భారతి హితైషి సభ' అను సంస్థను స్వయంగా ఏర్పాటు చేసి వితంతువులను, ఇతర అవసరార్థులను ఆదుకుంటూ గడిపారు. 1920 తరువాత కాలంలో మౌల్వీ లియాఖత్ హుస్సేన్ ఎవ్వరికి అందుబాటులో లేని అజ్ఞాత జీవితం గడిపారు.

✤




**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# నిదురపోరా తమ్ముడా!

డా.ఎన్. కలీల్

నిదురపో... నిదురపో... నిదురపో
నిదురపోరా తమ్ముడా
నిదురలోన గతమునంతా
నిముషమైనా మరచిపోరా
కరుణలేని ఈ జగాన
కలత నిదురే మేలురా
నిదురపోరా తమ్ముడా... ఆ...
కలలు పండే కాలమంతా
కనుల ముందే కదలిపోయే... ఆ...
లేత మనసుల చిగురుటాశ
పూతలోనే రాలిపోయే
నిదురపోరా తమ్ముడా... ఆ...
జాలి తలచి కన్నీరు తుడిచే
దాతలే కనరారే...
చితికిపోయిన జీవితమంతా
చింతలో చితియాయె
నీడచూపె నెలవు మనకు
నిదురయేరా తమ్ముడా
నిదురపోరా తమ్ముడా

అబ్బా ఎంత చక్కటి పాటాను రాశారు కీర్తిశేషులు సుసర్ల దక్షిణా మూర్తి గారు.. ఇంకా ఇలా ఎన్నో పాటలు ఉన్నాయి...

సరే అసలు విషయానికి వస్తే..

చక్కటి ఆరోగ్యానికి నిద్ర దివ్యమైన ఔషధం. అలసి సొలసిన శరీరం, మనసు సేదదీరి సాంత్వన పొందేది నిదురలోనే. ఆమాటకొస్తే రోజూ ముల్లోకాలను కాపాడుతూ క్షణం తీరిక

లేకుండా ఉండే ఆ దేవుడికి కూడా నిద్ర అవసరమే. అది గ్రహించాడు కాబట్టే భక్తాగ్రేసరుడైన అన్నమయ్య జో అచ్యుతా నంద జోజో ముకుందా, రావె పరమానంద రామ గోవిందా అంటూ జోలపాటతో తన ఆరాధ్యదైవాన్ని రోజూ నిద్రపుచ్చే వాడు. నిద్ర సుఖమెరుగదు. మేడ మిద్దెలో ఉన్నా, చెట్టునీడ పడుకున్నా నిదురలోకి జారుకున్నాక ఇక ఈ లోకం సంగతి పట్టదు. మన స్థితిగతులు మనకు గుర్తుకురావు. చీటికిమాటికి స్ఫురణకొచ్చి మనసును కలత పెట్టే కష్టాలు, కన్నీళ్లు నిద్రలో ఉన్నప్పుడు మన దరిదాపులకు కూడా రావు. కునుకు పడితె మనసు కాస్త కుదుట పడతది అని మనసుకవి పడుకునే తీరును బట్టి నిద్ర పలురకాలు. గాఢనిద్ర ఒంటికి మంచిదనేవారే ఒళ్లు తెలియకుండా పడుకుంటే

'ఏవిటా మొద్దునిద్ర' అని మందలించడమూ కద్దు. పడుకున్నది మొదలు తడవ తడవకూ నిద్ర లేచేవారిని 'కోడి కునుకు' అంటూ ముద్దుగా కసురుకోవడమూ తెలిసిందే. కోడి పట్టుమని పది నిమిషాలు కూడా కళ్లుమూసుకుని పడుకోదు. ఎప్పుడేం జరుగు తుందోననే భయంతో తడవతడవకూ కళ్లు తెరిచి చూడటం దాని సహజ లక్షణం. డాల్ఫిన్లు, సీల్ వంటి సముద్ర క్షీరదాలు ఒక కన్ను తెరిచి నిద్రపోతాయి. ఈ రకపు నిద్రను ఆంగ్లంలో 'యుని హెమిస్ఫెరిక్ స్లీప్' అంటారు. ఎవరిపైనైనా నిఘా వేయ డాన్ని 'ఓ కన్ను వేసి ఉంచడం' అని అంటూ ఉంటాం. ఇలాంటి ఒంటికన్ను నిద్రాజీవులను చూసే ఈ నానుడి పుట్టి ఉండవచ్చు. ఇక పాములకి, మరికొన్ని జంతువులకీ కనురెప్పలు ఉండవు. అవి కళ్లు తెరిచే నిద్రపోతాయి. జంతువుల ప్రస్తావన వచ్చింది కాబట్టి కోలా అనే జీవి గురించి చెప్పుకోకపోతే బాగోదు. చిన్న సైజు ఎలుగుబంటి లాగ ఉండే ఈ కోలా మొద్దునిద్రకు మారుపేరు. రోజులో 22 గంటలు పడుకునే ఉంటుంది. అయితే ఎలా నిద్ర పోయినా నిద్ర నిద్రే. అలసిపోయిన మెదడుకు, ఇతర శరీర భాగాలకు విశ్రాంతినిచ్చేందుకు నిద్ర తప్పనిసరి. మధ్యాహ్న భోజనం తరువాత ఓ పది నిమిషాలు కునుకు తీస్తే ఆ కిక్కే వేరు. ఇలా కునుకు తీయడం ఎన్నో విధాల మంచిదని గతంలో ఎందరో నిపుణులు నొక్కి చెప్పారు కూడా.

నిద్రకు గల ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ఏటా మార్చిలో వచ్చే మూడవ శుక్రవారాన్ని 'ప్రపంచ నిద్ర దినోత్సవం'గా జరుపు కోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆరోగ్యకరమైన నిద్ర వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయడమే ధ్యేయంగా వరల్డ్ సొసైటీ 2008 నుంచి నిద్ర దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా రెస్ మెడ్ అనే సంస్థ నిద్రపై జరిపిన తాజా సర్వేలో వెల్లడైన వివరాలు కలవరం కలిగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 36వేలమందిపై జరిపిన ఈ సర్వేలో 27 శాతం మంది మాత్రమే రోజూ రాత్రివేళ ఆరు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోతున్నా రట. గత ఏడాది ఇదే సంస్థ చేసిన సర్వేలో 80శాతం మంది తగినంతసేపు నిద్రపోతున్నట్లు వెల్లడి కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య 27 శాతానికి దిగ జారడం ప్రజలలో తీవ్రతరమవుతున్న నిద్రలేమికి నిదర్శనం. మితిమీరిన సెల్ ఫోన్ వాడకమే ఇందుకు కారణం కావడం గమనార్హం.

నిద్రకు, సెల్ ఫోనుకు లంగరు కుదరదు. కుర్రకారు పుస్తకం చేతిలోకి తీసుకోగానే నిద్రాదేవత ఎక్కడున్నా సరే ఠపీమని వచ్చి ఒడిలో వాలిపోతుంది. కానీ, సెల్ ఫోన్ ఆన్ చేస్తే మాత్రం.. అదే నిద్ర రమ్మన్నా రాదు. సెల్ ఫోన్ లోంచి వెలువడే కాంతి కిరణాలు కంటికి హానికరమని డాక్టర్లు నెత్తీ నోరూ మొత్తుకుంటున్నా,

సెల్లుంటే పండగ...

స్లీప్ ఎందుకు దండగ...

అనుకునే యువతీ యువకుల సంఖ్య ఎక్కువయిపోయింది. మనిషి గుప్పిట్లో ఉండవలసిన చరవాణి.. ఇప్పుడు మనిషినే గుప్పిట్లో పెట్టుకోవడం విచిత్రమైన పరిణామం. టెక్నాలజీని ఒడిసిపట్టుకుంటున్న యువతరం.. ఆ టెక్నాలజీని వాడవలసిన తీరులో వాడకపోవడమే ప్రస్తుత పరిస్థితికి కారణం. సెల్ హల్ చల్ కు ఇకనైనా కళ్లెం పడితేనే కంటికీ, ఒంటికీ మంచిది!.

ఏ మంటారు మరీ..

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

రూహీ



# ఇచ్చే చేయి పైనా ఉండదు... పుచ్చుకునే చేయి క్రిందా ఉండదు

**ఇస్లాము**లో దానధర్మాల గురించి ఆలోచించినప్పుడు ఒక పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ అందులో కనిపిస్తుంది.

ఖైరాత్ అనేది ఉర్దూ పదం. దానధర్మాలన్నింటి కోసం ఉద్దేశించి ఈ పదాన్ని ఉపయోగించవచ్చు. సాధారణ అర్థంతో ఉపయోగించే పదం. స్వచ్ఛందంగా చేసే దానధర్మాలన్నీ ఇందులో ఉన్నాయని చెప్పవచ్చు.

ఇలాంటిదే.. సదఖా... ఇది అరబీ పదం. సాధారణంగా చేసే దానధర్మాలన్నీ ఇందులోకే వస్తాయి.

ఇస్లాములో దానధర్మాలు చేయడం కేవలం స్వచ్ఛందంగా చేసేవి మాత్రమే కాదు. తప్పనిసరిగా నిర్దిష్ట శాతం దానధర్మాలు చేయడం జకాత్ అనబడుతుంది. జకాత్‌ను సదఖా అని పిలవవచ్చు. కాని ప్రతి సదఖా జకాత్ కాదు.

అలాగే జకాత్ కూడా ఒకవిధమైన ఖైరాత్ క్రిందికే వస్తుంది. కాని ప్రతి ఖైరాత్ జకాత్ కాదు.

క్లుప్తంగా చెప్పాలంటే జకాత్ తప్పనిసరిగా ప్రతి ముస్లిం చెల్లించ వలసిన నిర్దిష్ట శాతం దానధర్మాలు.

సదఖా, ఖైరాత్ అనేవి స్వచ్ఛందంగా చేసే దానధర్మాలు. స్వచ్ఛందంగా చేసే దానధర్మాలు మనిషి తన ఇష్టం వచ్చినంత చేయవచ్చు. ఎంత ఎక్కువ దానధర్మాలు చేస్తే అంత పుణ్యం సంపాదించుకుంటాడు. జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి. ఇందులో ఇష్టాయిష్టాల ప్రమేయమే లేదు. ఇష్టమున్నా లేకపోయినా జకాత్ ఇవ్వడం తప్పదు. ఎవరైనా లోభత్వంతో స్వచ్ఛందంగా చేసే దానధర్మాలు తప్పించుకోవచ్చు కాని తప్పనిసరిగా ఇవ్వవలసిన జకాత్‌ను ఎలా తప్పించుకుంటాడు.

మీరడగవచ్చు... జకాత్ ఇవ్వకపోతే అడిగేవాడెవ్వడు?

జకాత్ ఇవ్వకపోతే ఇక్కడ ఏ ప్రభుత్వమూ అడగదు? ఎవరు నిలదీయలేరు? ఎవరు బలవంతం చేయలేరు? పోలీసులు పట్టుకోరు? కోర్టులు శిక్ష విధించడం జరగదు. అలాంటప్పుడు తప్పనిసరిగా ఇవ్వడం అనే పదానికి ప్రాముఖ్యం ఏముందని ఎవరైనా అడగవచ్చు.

ఈ లాజిక్ కాస్త పొడిగించి ఆలోచిస్తే... రమజాన్ మాసంలో ఉపవాసం ఉండకపోతే పట్టుకునేదెవ్వరు? ఉపవాసం ఉన్నానని పోజులు కొడుతూ రహస్యంగా బిరియానీ లాగించేస్తే అడిగేదె వ్వడు? ఏ పోలీసు అడగడు? ఏ కోర్టు శిక్ష విధించదు. అయినా ముస్లిములు, చిన్న పిల్లలు కూడా కఠినంగా ఉన్నప్పటికీ, మండుటెండా కాలం అయినప్పటికీ, పచ్చి మంచినీళ్ళు కూడా తాగకుండా నిజాయితిగా ఎందుకు ఉపవాసాలు ఉంటారు?

ఇది ధార్మిక విశ్వాసంలో ఉన్న బలం. మనిషిని క్రమశిక్షణా బద్ధుడిగా మార్చేస్తుంది. మనిషిని నియమాలకు కట్టుబడేలా చేస్తుంది. ఏ ధార్మిక విశ్వాసమైతే మనిషిని కఠినమైన ఉపవాసం ఉండేలా చేసిందో అదే ధార్మిక విశ్వాసం ఖచ్చితంగా, తప్పనిసరిగా చెల్లించవలసిన దానధర్మాలు, అంటే జకాత్ కూడా చెల్లించేలా చేస్తుంది.

ఈ దానధర్మాలకు ఆర్థిక వ్యవస్థకు సంబంధమేమిటని మీరు అనుకోవచ్చు. చాలా దగ్గరి సంబంధం ఉంది. కాస్త గమనించండి, రమజాన్ మాసంలో జరిగినంత షాపింగ్ మరో మాసంలో ఎప్పుడైనా చూశారా? ఆహార దినుసులు, దుస్తులు, ఫర్నిచర్ అన్నీ ఈ నెలలో కొంటుంటారు. ఎంత డబ్బు మార్కెట్‌లో ప్రవహిస్తుంది. జకాత్ ద్వారా, దానధర్మాల ద్వారా సంపన్నుల నుంచి పేదలకు పంపిణీ అయిన సొమ్ము వారి అవసరాల కోసం చేస్తున్న కొనుగోళ్ళ వల్ల మార్కెటులో ప్రవహిస్తుంది. ప్రజల్లో క్రయశక్తిని పెంచే ఏర్పాటే ఈ దానధర్మాలు. ఆర్థిక వ్యవస్థకు ప్రతి ఏటా ఇవి బెయిలవుట్ వంటి సదుపాయాలు. కొద్దిపాటి ఆర్థికశాస్త్ర పరిజ్ఞానం ఉన్నా ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

ఇప్పుడు జకాత్ గురించి మాట్లాడుకుందాం. అవసరమున్న వారు జకాత్ నిధుల నుంచి తనకు కావాలని అడగవచ్చా? అనే ప్రశ్నకు జవాబు తప్పక అడగవచ్చు. అడిగి తన హక్కుగా జకాత్ తీసుకోవచ్చు.

అలాగా జకాత్ చెల్లించేవారు ఎవరికి వారు వ్యక్తిగతంగా తాము ఎవరికి ఇవ్వాలనుకుంటారో వారికి ఇవ్వవచ్చు.

ఎవరికి చెల్లించాలనే ప్రశ్నకు సమాధానం నిరుపేదలు, అవసరమున్న వారు, అప్పులపాలైన వారు మొదలైన వారికి ఇవ్వాలి. మరో కండీషన్ కూడా ఉంది. బంధువులకు అందరికన్నా ఎక్కువ హక్కు ఉంటుంది. అంటే బంధువుల్లో నిరుపేదలకు జకాత్ పొందే హక్కు అత్యధికంగా ఉంటుంది. అవసరమున్న వారిలో బంధువులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. అప్పులపాలయిన బంధువులకు మొదటి హక్కు ఉంటుంది.

మరికాస్త లోతుగా అర్థం చేసుకుందాం.

మనం బాగానే బతుకుతుండవచ్చు. కాని మన బంధువుల్లో కొందరు ఆర్థికంగా కష్టాల్లో ఉండవచ్చు, కొందరు తమ ఆర్థిక కష్టాలను అభిమానం కారణంగా చెప్పుకోలేకపోవచ్చు. అమ్మాయి పెళ్ళి, అబ్బాయి చదువు, ఇంట్లో తల్లిదండ్రుల అనారోగ్యం ఇలా అనేక రకాల కష్టాలను పంటి బిగువున భరిస్తూ బతుకుతుండడం జరగవచ్చు. వాళ్ళు చెప్పడం లేదు కాబట్టి వాళ్ళ కష్టాలేమిటో మనం తెలుసుకునే ప్రయత్నం కూడ చేయం.

కాని జకాత్ అనే ధార్మిక విధి బంధువులు ఎలా ఉన్నారని తెలుసుకునేలా ప్రోత్సహిస్తుంది. బంధువుల్లో ఎవరు కష్టాల్లో ఉన్నారు. ఎవరికి అవసరాలు ఉన్నాయి. అని బంధువుల గురించి ఆలోచించేలా చేస్తుంది. ఇది జకాత్ సొమ్ము అని చెప్పి ఇవ్వవలసిన అవసరం లేదు. జకాత్ సొమ్ము అని చెప్పకుండా, వారి అభిమానం దెబ్బ తినకుండా వివేచనతో వారికి ఆర్థిక సహాయం చెల్లించేలా ప్రోత్సహిస్తుంది. ఆ విధంగా బంధువుల మధ్య పటిష్టమైన సంబంధాలు ఏర్పడతాయి. బంధుత్వ సంబంధాలు, ఆత్మీయతలు, అభిమానాలు బలంగా ఉన్న సమాజం ఒక మంచి సమాజంగా మారుతుంది.

జకాత్ తీసుకునే అర్హత బంధువుల తర్వాత మన ఇరుగు పొరుగుల్లో, మన ముహల్లాలో కష్టాల్లో ఉన్న వారికి ఉంటుంది. ఇక్కడ కూడా అదే సూత్రం. వారు అభిమానంతో అడగకపోవచ్చు. మనమే అలాంటి వారెవ్వరో తెలుసుకుని, వారి అభిమానం దెబ్బ తినకుండా, ఇది జకాత్ సొమ్ము అని చెప్పకుండా వారికి ఇచ్చి ఆదుకోవాలి. ఈ విధంగా జకాత్ బంధుత్వ సంబంధాల్లో అప్యాయతలు, అనుబంధాలను బలపడేలా చేస్తుంది. అదే విధంగా ఇరుగు పొరుగు మధ్య అద్భుతమైన సోదర సంబంధం ఉన్న సమాజాన్ని నిర్మిస్తుంది.

వ్యక్తిగతంగా ఎవరికి వారు జకాత్ ఇచ్చుకోవచ్చు అని చెప్పుకున్నాం కదా... అలాగే కొన్ని సామాజిక సంస్థలు, జకాత్ సంస్థలు సామూహికంగా జకాత్ సేకరించి సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయవచ్చు. పేద పిల్లలను చదివించడం, పేద పిల్లలకు హాస్టళ్ళు నడపడం, పేద అమ్మాయిల పెళ్ళిళ్ళు జరిపించడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు ఈ నిధులతో జరిపించవచ్చు. నిజానికి జకాత్‌తో పాటు ఉష్ర్ కూడా చాలా మంది చెల్లిస్తుంటారు. ఉష్ర్ అంటే వ్యవసాయ పంటపై చెల్లించే జకాత్. దీని లెక్కలు వేరే ఉన్నాయి.

జకాత్ మాత్రమే కాదు, ఈద్ పండుగ కన్నా ముందు ఫిత్రా అనబడే దానం కూడా చెల్లించాలి. ఇది కూడా తప్పనిసరి దానమే.

రమజాన్ పండుగను నిజానికి ఈదుల్ ఫిత్ర్ పండుగ అంటారు. అంటే ఇది ఫిత్రా ఇవ్వవలసిన పండుగ.

ప్రతి ముస్లిం తప్పనిసరిగా చెల్లించవలసిందే. ఇంటిలో ఉన్న పిల్లలకు, పసిపాపలకు కూడా ఇంటిపెద్ద చెల్లించవలసి ఉంటుంది.

ఫిత్రా ఖచ్చితంగా ఈద్ నమాజు కన్నా ముందే చెల్లించాలి. ఫిత్రా చెల్లించకపోతే ఈద్ నమాజు పూర్తి కాదు.

దీనివల్ల ఏమవుతుందంటే, పండుగ రోజు పండుగకన్నా ముందే బీదసాదల చేతికి ఫిత్రా లభిస్తుంది. వాళ్ళు కూడా సంతోషంగా పండుగ జరుపుకునే వాతావరణం ఏర్పడుతుంది.

ఫిత్రా ఎవరు చెల్లించాలి? ఎవరికి చెల్లించాలి? అనే ప్రశ్నల గురించి ఆలోచిస్తే

ప్రతి ఒక్క ముస్లిం చెల్లించాలి. ఫిత్రా చెల్లించే స్తోమత కూడా లేని నిరుపేదలు ఈ ఫిత్రా స్వీకరించడానికి అర్హులు. వచ్చి యాచించిన వాళ్ళకు ఇవ్వడమనేది బిచ్చమవుతుంది. ఇస్లాంలో బిచ్చమనే భావనే లేదు. పేదలను వెదుక్కుని వెళ్ళి వారికి ఇవ్వడమే ఇస్లామీయ దానధర్మాల అంతస్సూత్రం. నిరుపేదల వద్దకు వెళ్ళి ఫిత్రా ఇవ్వడం సాధారణంగా కనబడు తుంది. ఇచ్చే చేయి పైన ఉండడం తీసుకునే చేయి క్రింద ఉండడం వంటి కాన్సెప్ట్ ఇక్కడ లేదు. ఇవ్వడం బాధ్యతగా మారిపోతుంది. తీసుకోవడం హక్కుగా మారిపోతుంది. కాబట్టి ఇచ్చేవాడు గొప్ప, పుచ్చుకునేవాడు తక్కువ అనేది లేదు. గొప్పవాడు దేవుడొక్కడే.

జకాత్, ఉష్ర్, సదకా, ఫిత్ర్, ఖైరాత్ ఇవన్నీ సంపదను సమాజంలో పంపిణీ చేసే ఏర్పాట్లు. ఇవ్వడాన్ని ప్రోత్సహించే పనులు. వీటితో పాటు వక్ఫ్‌ను కూడా గమనించాలి. ఏదన్నా ఒక మంచి పనికి తన ఆస్తిని వక్ఫ్‌గా ఇచ్చేయడం జరుగుతుంది. అలా ఇచ్చిన ఆస్తులే నేటి వక్ఫ్ ఆస్తులు. ఈ ఆస్తుల ఆదాయంతో ఎన్నో సంక్షేమ కార్యకలాపాలు నడపవచ్చు. పేదసాదలను ఆదుకోవచ్చు. సమాజ సంక్షేమం, పేదల సంక్షేమం, సంపద పంపిణీ ద్వారా ఆర్థిక న్యాయం ఇస్లామును నిశితంగా అధ్యయనం చేస్తే చాలా విషయాలు అర్థమవుతాయి.

నిజానికి దానధర్మాలంటే పుచ్చుకునేవాడిని తక్కువగా చూడడం ఎక్కడైనా జరగవచ్చేమో కాని ఇస్లాములో కాదు. పుచ్చుకునేవాడు ఆ దానాన్ని స్వీకరించడం ఇచ్చేవాడికి చేస్తున్న మేలుగా పరిగణిస్తాడు. దానం చేసే అవకాశం దొరకడమే అదృష్టంగా భావించడం ఉంది.

ఈ ధార్మిక విశ్వాసం నిజానికి సంస్కృతి సంప్రదాయాల్లో కూడా కనిపిస్తుంది. ఉదాహరణకు ఎవరైనా బిచ్చమడిగితే ముస్లిములు "మాఫ్ కరో" అనడం చాలా మంది వినే ఉంటారు. మాఫ్ కరో అంటే "క్షమించండి" అని అర్థం. మాఫ్ కీజియే మరికాస్త మర్యాదగా చెప్పడం. బిచ్చమడిగిన వాడికి నేను తెలుగులో "క్షమించండి" అంటే నాకు పిచ్చి పట్టిందని అనుకుంటారు. కాని ఇస్లామీయ ధార్మిక విశ్వాస భావాలు బలంగా ఉన్న ఉర్దూ భాషలో బిచ్చమడిగిన వ్యక్తికి ఇవ్వనపుడు "మాఫ్ కరో" అనడం చాలా సహజమైన జవాబుగా వినిపిస్తుంది.

# శవం

ఆ సరస్సు అద్దంలో
నేనేం చూడాలి?
దాని లోతుల్లో
అగంతక శవం
గుచ్చి గుచ్చి చూస్తోంది
నేను చాలా సార్లు
రాళ్ళు అందులో విసిరాను
ఆ అద్దాన్ని పగలగొట్టాలని అనుకున్నాను
అలలు కొన్ని లేచాయి... కొంత విస్తరించి
మాయమయ్యాయి
ఆ నిశ్శబ్ద సరస్సులో మూల నుంచి
ఆ శవం గుచ్చి గుచ్చి చూస్తూనే ఉంది
శవం
ఈ రోజు
నా ఆలోచనలు దోచుకోడానికి
చూస్తుందా?
లేక
నా భవిష్యత్తు ఛాయలను
సరస్సు లోతుల్లో మడిచేయాలనుకుంటుందా
నేనెందుకు రాయి తీసుకుని
ఈ అద్దాన్ని పగలగొట్టాలి?
సరస్సులో శవం ఉంటే
సరస్సు కూడా శవంలోనే ఉంది
లేదా
రెండు కూడా
నీటి బొట్టుల మధ్య బంధీలుగా ఉన్నాయి.

(కశ్మీర్ కవి షబ్బీర్ అజార్ కవిత.
అనువాదం : వాహెద్)

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది**   **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**   **మక్కా అవతరణ**

# 43. అజ్ జుఖ్రుఫ్

## ప్రవేశిక

**పేరు :** 35వ ఆయత్‌లోని పదం (వ జు(ఖుఫన్) నుండి గ్రహించబడింది. భావం, 'జు(ఖుఫ్' అన్న పదం వచ్చిన సూరా అన్నది.

**అవతరణ కాలం:** విశ్వసనీయమయిన ఏ ఉల్లేఖనం ద్వారానూ తెలిసిరాలేదు. అయితే దీని విషయాలను పరిశీలిస్తే స్పష్టంగా ద్యోతకమవుతుంది, ఈ సూరా కూడా, అల్ మూ'మిన్, హా మీమ్ అస్‌సజ్దా, అష్ షూరా సూరాలు అవతరించిన కాలంలోనే అవతరించిందని. ఇవన్నీ ఒకే క్రమంలోని సూరాలుగా గోచరిస్తాయి. మక్కా తిరస్కారులు ప్రవక్త మహనీయుల (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ఎడల ప్రాణ సంకటంగా పరిణమించిన కాలంలో ఈ క్రమం ప్రారంభమయింది. రేయింబవళ్ళు తమ కూటముల్లో కూచుని సతతం సలహా సంప్రతింపులు జరుపుకునేవారు, ఆయన్ని ఎలా తుదముట్టించాలని. ఒక దాడి కూడా వారు జరిపారు. ఈ పరిస్థితులను గురించి 79, 80 వ ఆయత్‌లలో స్పష్టమయిన సంకేతముంది.

**ప్రధాన విషయం, చర్చనీయాంశాలు :** ఈ సూరాలో కురైషీయులు, అరబ్బులు పట్టుపట్టి అనుసరించే అజ్ఞాన పూర్వకమయిన నమ్మకాలు, మూఢ భావాలను మరీ ఘాటుగా విమర్శించడం జరిగింది. వాటి అసమంజసతను ఎంతో పటిష్ఠంగా మనోజ్ఞంగా బట్టబయలు చేయడం జరిగింది. తద్వారా సమాజంలోని కాస్తయినా సమంజసత గల ప్రతి వ్యక్తీ ఆలోచించగలగాలని తమ జాతి పట్టుకు కూర్చున్న ఈ అజ్ఞానం, మూఢత్వం ఎటువంటిదో గ్రహించగలగాలనీను. దానితో పాటు తమను ఇటువంటి చక్రవ్యూహం నుండి కాపాడాలని ప్రయత్నిస్తున్న వ్యక్తి వెంటపడి అతణ్ణి అంత మొందించాలని ఆలోచిస్తున్న తమ జాతిని గురించి తెలుసుకోగలగాలని దీని ఉద్దేశం.

**ప్రసంగం ఇలా ప్రారంభమయింది :** మీరు మీ దౌష్ట్యాల బలంతో ఈ గ్రంథ అవతరణను ఆపివేయాలని తలుస్తున్నారు. కాని దుష్ట జనుల కారణంగా అల్లాహ్ ప్రవక్తల ఆవిర్భావాన్ని, గ్రంథాల అవతరణను ఎన్నడూ ఆపలేదు. తన బోధన మార్గంలో అడ్డుగా నిలిచి ఉన్న దుర్మార్గుల్ని అంతమొందించాడు. ఇదే విధానాన్ని ఇప్పుడూ అవలంబిస్తాడు. ముమ్ముందు 41, 43, 79, 80 వ ఆయత్‌లలో ఇదే విషయాన్ని పునరుక్తం చేయడం జరిగింది. ప్రవక్త మహనీయుల (స) ప్రాణాల వెంట పడ్డ వారికి వినిపిస్తూ ప్రవక్త మహనీయుల (స) కు చెప్పడం జరిగింది, నీవు బ్రతికి ఉన్నా లేకపోయినా ఈ దుర్మార్గులకు మేము శిక్ష విధించి తీరుతాము. స్వయంగా వారిని కూడా అతిస్పష్టంగా హెచ్చరిస్తూ, మీరు మా ప్రవక్తకు వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని నిర్ణయించుకుంటే మేము సయితం నిర్ణయాత్మకమయిన ఒక చర్య తీసుకుంటాము అని చెప్పడం జరిగింది.

ఆ తరువాత ఈ జనం తమ గుండెలకు హత్తుకుపెట్టుకున్న ఆ మతం ఏమిటో, వీరు మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ని ఎదిరిస్తూ ముందు పెడుతున్న వీరి ఆ వాదనలేమిటో వెల్లడించడం జరిగింది.

వీరు స్వయంగానే అంగీకరించేవారు, భూమీ ఆకాశాలను, స్వయంగా తమను, తమ ఆరాధ్యులను సృష్టించిన వాడు పరమ ప్రభువు అల్లాహ్ మాత్రమే అని. తాము ప్రయోజనం పొంది అనుభవిస్తున్న వరప్రసాదాలన్నీ అల్లాహ్ ప్రదానం చేసినవే అనీ వారికి తెలుసు, వారు దాన్ని అంగీకరిస్తారు కూడా. అయినప్పటికీ అల్లాహ్‌తో పాటు దైవత్వంలో ఇతరుల్నీ సహవర్తులుగా ఎంచడాన్ని పట్టుపట్టి వాదిస్తారు.

దైవదాసుల్ని అల్లాహ్ సంతానంగా పరిగణిస్తారు. ఆ సంతానం కూడా ఆడ సంతానం. స్వయంగా తమకయితే ఆడ సంతానాన్ని నామోషీగా అవమానకరంగా భావిస్తారు.

**( ప్రవేశిక మిగతా వచ్చే సంచికలో )**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

అధ్యాయం : 35

## అన్సార్లు- ముహాజిర్ల మధ్యన దైవప్రవక్త(స) సోదర బంధాన్ని ఏర్పరచటం[1]

**416)** ఇబ్రాహీమ్ బిన్ సాద్ తన తండ్రీ తాతల నుండి సంగ్రహించిన విషయాన్ని ఇలా వివరించారు: ముహాజిర్లు మదీనా వచ్చినప్పుడు దైవప్రవక్త (సఅసమ్) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌కి– సాద్ బిన్ రబీకి మధ్య సోదర బంధం ఏర్పరిచారు. సాద్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌తో, "చూడండి, నేను అన్సార్లలో అందరికన్నా ధనికుణ్ణి. మీరు నా సంపదలోనుండి సగం తీసేసుకోండి. నాకు ఇద్దరు భార్యలున్నారు. మీరు వారిని చూసుకోండి. వారిలో మీకు నచ్చిన వారెవరో చెప్పండి. నేనామెకు విడాకులు ఇస్తాను. ఇద్దత్ (నిర్ణీత గడువు) పూర్తయ్యాక మీరు ఆమెను నికాహ్ చేసుకోండి" అని అన్నారు. సమాధానంగా అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) ఇలా అన్నారు : "అల్లాహ్ మీ ఆస్తిపాస్తుల్లో, ఆలుబిడ్డలలో శుభాన్ని ప్రసాదించుగాక! మీ మార్కెట్టు ఎక్కడో నాకు చెప్పండి". నేను బనూ ఖైనుఖా మార్కెట్టు దారి ఆయనకు చూపించాను. ఆయన అక్కడ వ్యాపారం చేసి తిరిగి వచ్చినప్పుడు, ఆయన దగ్గర కొన్ని జున్ను ముక్కలు, నెయ్యి ఉన్నాయి. ఆ రోజు నుంచీ ఆయన అలాగే ఉదయం మార్కెట్టుకు వెళ్ళి వ్యాపారం చేసి వచ్చేశారు. చివరకు ఆయన ఒక రోజు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చినప్పుడు, ఆయన శరీరంపై కుంకుమ పువ్వు రంగు (సువాసన) గుర్తులు కనిపించాయి. "ఏమిటిది?" అని ప్రవక్త(స) అడిగితే, 'నేను నికాహ్ చేసుకున్నాన'ని చెప్పారు. "మరయితే ఎంత మహర్ ఇచ్చావు?" అని దైవప్రవక్త(స) విచారించగా, 'ఒక బంగారు విత్తనం లేదా ఐదు దిర్హము (నాణాల)ల బరువుకు సమానంగా ఉన్న బంగారం అని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) బదు లిచ్చారు– ఇక్కడ ఉల్లేఖకుడు ఇబ్రాహీమ్ సందిగ్ధంలో పడ్డారు.

**418)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు : అన్సార్లు దైవప్రవక్త (సఅసమ్)తో 'యా రసూలల్లాహ్! ఖర్జూరపు తోటలను మాకూ– ముహాజిర్లకు మధ్యన పంచిపెట్టండి' అని విన్నవించుకోగా, "అది జరగని పని" అని దైవప్రవక్త(స) చెప్పారు. 'పోనీ, అలాగైతే మీరు మా తోటల్లో శ్రమదానం చేయండి. ఫలసాయంలో చెరిసగం తీసుకుందాము' అని అన్సార్లు ప్రతిపాదించగా, 'మీ మాట విన్నాము. ఇది మాకు సమ్మతమే'[1] అని ముహాజిర్లు చెప్పారు.

35-1. ముహాజిర్ ముస్లింలు తమ స్వస్థలాన్ని వదలి మదీనాకు వచ్చినప్పుడు ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఇల్లూ వాకిలినీ, ఆస్తిపాస్తులను, ఆత్మీయులను కోల్పోయిన బాధతో కృంగిపోతుండేవారు. అలాంటి క్లిష్ట పరిస్థితులలో దైవ ప్రవక్త(స) 150 మంది అన్సార్లు- 150 మంది ముహాజిర్ల మధ్య అపురూపమైన సోదర బంధాన్ని ఏర్పరచారు. తత్ఫలితంగా అన్సార్లు- ముహాజిర్ల మధ్యన నిజమైన సోదర బంధం ఏర్పడింది. అన్సార్లు తమ ముహాజిర్ సోదరులకోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడేవారు. చరిత్రలోనే అటువంటి ఉపమానం దొరకదు.

418-1. అంటే ఈ ప్రతిపాదన ధర్మసమ్మతంగా ఉంది. మీ తోటలు మీకే ఉంటాయి. మేము కష్టపడి పనిచేస్తాము. వచ్చిన పంటను సగం సగం పంచుకుందాము. తోటల్ని ఇరువర్గాల వారి మధ్య పంచి ఇవ్వడానికి దైవప్రవక్త(స) అంగీకరించ లేదు. ఎందుకంటే రానున్న కాలంలో ఎన్నో విజయాలు వరించనున్నాయని, తద్వారా వచ్చే ఆస్తుల్ని ముస్లింలకు ఇవ్వవచ్చని దైవ ప్రవక్త(స)కు 'వహీ' ద్వారా తెలియపరచబడింది. అలాంటప్పుడు అన్సార్ల ఆస్తుల్ని ఎందుకు పంపిణీ చేయాలి?

★★★




మూలం: మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి (రహ్మ)    అనువాదం: ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**అలాగే తౌహీద్** సామూహిక ప్రభావం కూడా ఎంతో లోతైనది. సామాజిక వ్యవహారాలకు ప్రాతిపదిక సంపూర్ణ న్యాయం, సమానత్వం. దేవుని ఏకత్వభావన, మానవులంతా ఒక్కటేనన్న భావన లేకుండా సంపూర్ణ న్యాయంగానీ, సమానత్వం గానీ నెలకొనవు. పస్తుత ప్రపంచంలో పతనానికి, వినాశానికి అసలు కారణమేమంటే, ప్రపంచంలో సైన్సు అభివృద్ధి చెందు తున్నంత వేగంగా నాగరికతా స్పృహ అభివృద్ధి చెందటం లేదు. సైన్సు ఎంతగా పురోగమించిందంటే మానవులు భౌగోళిక హద్దులన్నీ అతిక్రమించారు. తమ ఆవిష్కరణల, యంత్రాల శక్తితో సువిశాలమైన ఈ భూభాగాన్ని ఒక ఇంటి ప్రాంగణం మాదిరిగా మార్చేశారు. కాని మనో మస్తిష్కాల సంకుచిత స్థితి ఎలా ఉందంటే ప్రతి జాతికీ వేర్వేరు దేవుడున్నాడు. ప్రతి ఒక్కరి మానవ జాతి కూడా వేరుగానే ఉంది. ఒకవేళ ఈ రకమయిన మనుషులు గనక తమ హద్దులను దాటి ఒకరింకొకరి సరిహద్దుల లోపలికి చొచ్చుకుపోతే, నేడు ప్రపంచంలో వివిధ జాతుల మధ్య చూస్తున్న సంకుల సమరమే, మారణకాండే వీరి మధ్య కూడా జరగగలదు. వీరి రూపురేఖలు మానవుల్లాగా ఉన్నాయి. కాని వీరి మనసులు క్రూర మృగాలను పోలినవి. ప్రకృతి వీళ్ళను నదీనదాలు, కొండలు, అడవుల సరిహద్దుల ద్వారా వేర్వేరుగా ఉంచింది. కాని సైన్సు ఈ హద్దులను మీరిపోయింది. తత్ఫలితంగా వీరు ఒండొకరిపై అడవి మృగాల్లా విరుచుకుపడ్డారు. దాంతో ప్రపంచ శాంతి కరువైపోయింది. ఈ విపత్కర పరిస్థితులపై చింతన చేసిన వారు ఒక నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం ఏ సూత్రాలపై మన ప్రస్తుత సంస్కృతీ నాగరికతలు, సామాజిక వ్యవహారాల కట్టడం నిలబడి ఉందో, ఆ సూత్రాలు ప్రస్తుత ప్రపంచానికి సరిపోవు. పసితనంలో తొడిగిన ఈ చడ్డీ ఆరడుగుల మనిషికి మరీ కురచ అయిపోయింది. ఇప్పుడు దాని పొడవు వెడల్పు దృష్ట్యా దాని కోసం ఓ సరికొత్త తొడుగును తయారు చేయాల్సి ఉంది. జాతి, వంశం, వర్ణం, ప్రాంతం, భూమి పుత్ర మూలాలపై ఏ సంస్కృతీ నాగరికతలు వెలిసాయో, ఏ రాజకీయ సంస్థలు ఉనికిలోనికి వచ్చాయో అవి అంతం కావలసిన సమయం ఆసన్నమయింది. ఇప్పుడు ప్రపంచం ఓ నూతన వ్యవస్థ (New Order) అన్వేషణలో ఉంది. అయితే ఆ నూతన వ్యవస్థ ఏది కాగలదు?

ఈ ప్రశ్నకు జవాబు ఇంతవరకు ఎవరూ ఇవ్వలేకపోయారు. ఇప్పుడు ప్రపంచానికి జాతీయ ప్రభుత్వాల స్థానే అంతర్జాతీయ లేక ప్రపంచ ప్రభుత్వం (World State) అవసరమనీ, దానికి ప్రాతిపదిక విశ్వజనీన మానవతా దృక్పథం అయి ఉండాలని కొందరు ప్రతిపాదిస్తున్నారు. అయితే శుభప్రదమైన ఈ విశ్వజనీన మానవతా దృక్పథం ఏ విధంగా ఉనికిలోనికి రాగలదో వారు చెప్పలేకపోతున్నారు. వివిధ జాతుల పోకడ ఎలా ఉందంటే, వాటికి ఉమ్మడి దేవుడు లేడు. వారి మూల

పురుషుడు ఆదమ్ కూడా ఒక్కడు కాడు. ప్రతి ఒక్క జాతి చెప్పేదొక్కటే- నేనే అసలైన దానిని. మిగతా జాతులకు ఏ ప్రాతిపదికా లేదు. ప్రతి ఒక్క జాతి దేవుడు వేరు. దాని సంతతి వేరు. దాని తండ్రి ఆదమ్ వేరు. అది తన నాగరికతలో, నమ్మకాలలో, తన నైతికతలో పూర్తిగా వేరైనది. అది తన ఈ వేర్పాటును (ప్రత్యేకతను) కేవలం మిగిల్చి ఉంచటంతోనే సరిపెట్టుకోక, దానిని ఇతరులపై బలవంతంగా రుద్దాలని కోరుకుంటున్నది.

మస్తిష్కాలలోని ఈ ముడి విచ్చుకోనంత వరకు ఈ జాతుల మధ్యన సంగతితత్వపు ఉమ్మడి బాంధవ్యమేదీ ఏర్పడదు. ఆ ఉమ్మడి బాంధవ్యం ఒక్కటే కాగలదు- అదే అందరూ ఒక్కడైన దైవాన్ని తమ దైవంగా అంగీకరించాలి. ఆయన పంపిన శాసనాన్నే అందరూ తమ శాసన స్మృతిగా ఆశ్రయించాలి. అందరూ ఒకే పితామహుని-మూల పురుషుని- సంతానమని నమ్మి, తాము ఆ సంతతికి చెందిన సభ్యులమని భావించాలి. ఈ ప్రాతిపదికపై నిశ్చయంగా ఒక విశ్వజనీన జాతీయత, ఒక అంతర్జాతీయ రాజకీయ సంస్థ ఏర్పడగలదు. ప్రపంచంలో ప్రస్తుతం నెలకొని ఉన్న సంక్షోభాలు, విపత్తులు అంతం కాగలవు. ఇది కాకుండా వేరితర ఎన్ని ఉపాయాల ద్వారా ఈ సంక్షోభాన్ని అధిగమించాలని ప్రయత్నించినా గండం నుంచి గట్టెక్కటం సంగతి అలావుంచి, మరొక చిక్కుముడిని పెంచినట్లవుతుంది.

ఈ పరమార్థం దృష్ట్యానే ఖుర్ఆన్ (అన్ నిసా సూరా ఆరంభంలో) మానవ సమాజం ప్రాతిపదికను మతధర్మం, కుటుంబం అనే రెండు విషయాలపై నెలకొల్పింది. తరువాత ఆ మత ధర్మాన్ని దేవుని ఏకత్వం (తౌహీద్) పునాదిపై నిలబెట్టింది. అంటే కేవలం అల్లాహ్‌నే ప్రభువుగా, శాసన ప్రదాతగా అంగీకరించాలి. ఇతరులకు ఇందులో ఎలాంటి భాగస్వామ్యం కల్పించరాదు. ఇక కుటుంబానికి ప్రాతిపదిక ఆది మానవుడైన ఆదం అందరికీ తండ్రి అని నమ్మి నడుచుకోవాలి. అంటే మానవ జాతి అంతా ఒక్కటేనని, వారిలో ఎవరికీ ఎవరిపైనా ఎలాంటి ఆధిక్యత, ప్రాధాన్యత లేదని ఒప్పుకోవాలి. ఒకవేళ ప్రాధాన్యత అంటూ ఎవరికయినా ఉంటే భయభక్తుల ఆధారంగానో, మంచితనం, నిజాయితీ తత్పరత ఆధారంగానో ఉంటుందని నమ్మాలి.

మొదటి విషయం బహుదైవాల నుండి, ఎందరో శాసనకర్తల మధ్య ఏర్పడే సంఘర్షణ నుండి ఖుర్ఆన్ లోకానికి విముక్తిని ప్రసాదించింది. రెండవ విషయం వంశం, వర్ణం, కుటుంబం ఆధారంగా తలెత్తే గర్వాహంకారాన్ని అణచివేసింది. మానవులంతా ఒకే దేవుని దాసులుగా, ఒకే ఆదమ్ సంతానంగా ఖరారయ్యారు. నల్లవానికీ- తెల్లవానికీ, అరబ్బుకు- అరబ్బేతరునికి మధ్య ఎలాంటి భేదభావం మిగులలేదు. అందరికీ ఒకే చట్టం, ఒకే వ్యవస్థ. అందరికీ సమన్యాయం, అందరికీ ఒకే శాంతిభద్రతల వ్యవస్థ. పరిశ్రమించడానికి అందరికీ ఒకే కార్యక్షేత్రం. అందరికీ సమానమైన హక్కులు, సమానమైన బాధ్యతలు. అక్కడ ఏ సంతతి వారినైనా, వారు జన్మతః బానిసలని భావించటం ఘోరమైన పాపం. అక్కడ ఈరానీయులకు- సామీ సంతతి వారికి మధ్య ఏ రకమైన వివక్ష కనబరిచినా అది భువిలో కల్లోలం రేకెత్తించటం లాంటిదే. అక్కడ రెడ్ ఇండియన్లను కేవలం రంగు ఆధారంగా హక్కుల నుండి వంచితుల్ని చేయటం ఘోరమైన అన్యాయం, దౌర్జన్యం. ఈ వ్యవస్థలో ఈ సూత్రాలను త్రోసిపుచ్చిన వారే ఈ సమన్యాయానికి, హక్కులకు నోచుకోకుండా పోతారు. ఎందుకంటే వారు మానవతా విరోధులు. శాంతికీ, న్యాయానికి శత్రువులు. వారు ధరణిలో అరాచకాన్ని, విధ్వంసాన్ని సృష్టించగోర్తున్నారు. మానవ సమాజం ఏ మూలికలకు దూరమై ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోజాలదో, ఆ మూలికలను వారు కూకటివేళ్ళతో పెకలించాలని కోరుకుంటున్నారు.

నేడు ప్రపంచం కొరకు ఒక నూతన వ్యవస్థకై అన్వేషించే వారు దేవుని ఏకత్వపు (తౌహీద్) వాస్తవికతను అర్థం చేసుకోనంత వరకు తమ లక్ష్యసాధనలో సఫలీకృతులు కాలేరు. దైవదాస్యం చేయటం, దైవానికి విధేయత చూపటం అనేది మానవ నైజంలో అంతర్లీనమై ఉన్న విషయం. ఇది ఎంత మహత్తరమైన విషయమంటే, సమస్త మానవ జాతిని దీని వైపునకు పిలువవచ్చు. మంచి స్వభావం కల ప్రతి వ్యక్తీ- అతను ఏ జాతికి, సంతతికి చెందినవాడైనా- ఎలాంటి దురభిమానం, పక్షపాతం చూపకుండా ఈ సందేశాన్ని స్వీకరించగలడు. ఈ తౌహీద్ సందేశంలో మానవ నైజం వాంఛించే, మానవ సమాజం కాంక్షించే దివ్య ఆయస్కాంతం ఉంది. మనిషి అంతరంగంలోనూ, బాహ్య ప్రపంచంలోనూ ఎవరూ త్రోసిపుచ్చలేని సాక్ష్యాధారాలు, నిదర్శనాలు ఇందులో ఉన్నాయి. ఇది మినహా మిగిలిన వాదాలన్నీ అజ్ఞానంతో కూడుకున్నవే. మానవ నైజాన్ని అప్పీలు చేసే శక్తి వాటిలో లేదు. పోనీ విశ్వ వ్యవస్థతో అవి సమరసం చెందుతున్నాయా అంటే అదీ లేదు. ఒకవేళ బలవంతంగా వాటిని ఈ ప్రపంచంపై రుద్దే ప్రయత్నం చేస్తే ప్రపంచ స్వభావం దానిని జీర్ణించుకోదు, దానిని కక్కేసే ప్రయత్నం చేస్తుంది. ఫలితం సుస్పష్టమే. ఈ ప్రయత్నం విఫలమైనా అవుతుంది. లేదా ఒకవేళ అది విజయవంతం అయినా మింగలేక కక్కలేక గొంతులో ఇరుక్కుని ఉంటుంది. ప్రపంచంలో నెలకొని ఉన్న మిథ్యా ధర్మాలలో మరో మిథ్యా ధర్మం అధికమవుతుంది. ❑

# డిగ్రీ తర్వాత విద్య, ఉద్యోగావకాశాలు



- డా.మహ్మద్ హసన్, 9908059234.

**ఉభయ** రాష్ట్రాలలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో గతంలో డిగ్రీ పూర్తి చేసిన, త్వరలో డిగ్రీ పూర్తి చేయబోతున్న విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు, ఆశీస్సులు. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు పెద్దలు. అందుకే కృషి వుంటే మనుషులు రుషులవుతారు మహా పురుషులవుతారు అన్నాడు జ్ఞానపీఠ్ అవార్డు గ్రహిత సినారె గారు. మన కృషి, పట్టుదలే విజయ తీరాలకు చేరుస్తుంది. తరగతి గదిలో చాలామంది చదువుతున్నట్లుగా మనకు కన్పిస్తారు. కొద్దిమంది విద్యార్థులు పుస్తకంపై, సమకాలీన అంశాలపై శ్రద్ధ కనబరుస్తూ వుంటారు, మరికొద్ది మంది పుస్తక జ్ఞానం తప్ప ఏది తెలిసి ఉండదు. ఈ రకమైన విద్యార్థులే పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. ప్రతి ఒక్కరికి ఏదో ఒక లక్ష్యం వుంటుంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా, సమయాన్ని సద్వినియోగం చేసుకొని, విషయ నిపుణుల సలహాలు, సూచనలు, గతంలో విజయాలు సాధించిన వారి పర్యవేక్షణలోను లేదా వారి సూచనలు పాటించి పోటీ పరీక్షలకు సన్నద్ధులు ఐతే "ఖచ్చితంగా విజయం సాధించగలరు. లేని పక్షంలో విజయం అందీ అందకుండా చేజారుతుంది. చదవడం ఒక ఎత్తు, పోటీ పరీక్షలలో విజయం సాధించడం మరొక ఎత్తు.

అందుకే విషయ పరిజ్ఞానంతో పాటు సమయస్ఫూర్తి నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలు, భాషా నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ కల్గివుంటే విజయం మీ సొంతమవుతుంది.

చాలామంది విద్యార్థులు ఇంటర్ తర్వాత డిగ్రీ, డిగ్రీ తర్వాత పీజీ ఇలా చదువుకుంటూ వెళ్తారు. కాని సమాంతరంగా పోటీ పరీక్షలపై శ్రద్ధ పెడితే ఇంటర్ తర్వాతనో డిగ్రీ తర్వాతనో ఖచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందే అవకాశం, అదృష్టం కల్గుతుంది.

## డిగ్రీ తర్వాత విద్యావకాశాలు

B.A. వారికి :

B.Ed. (రెండు సంవత్సరాల కోర్సు)

B.P.Ed. (ఒక సంవత్సరం కోర్సు)

Lawcet 3 సంవత్సరాల LLB కోర్సు

M.A. రెండు సంవత్సరాల PG కోర్సు:- ఇందులో విద్యార్థి కోరిక మేరకు డిగ్రీలో వున్న అప్షనల్స్ లేదా లాంగ్వేజెస్‌కి అనుగుణంగా P.G. కోర్సును ఎంచుకోవచ్చును.

MA హిస్టరీ, MA తెలుగు

MA (Eng Litt), MA Sociology

M.A. ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఫిలాసఫి, లైబ్రరి సైన్స్

మొదలైన కోర్సులు చేయవచ్చును. అలానే ప్రభుత్వం లేదా ఆయా యూనివర్సిటీలు ఏదైనా విద్యావిధానపరమైన మార్పులు, చేర్పులు చేస్తే కొత్త కోర్సులు కూడా చేసే వెసులుబాటు వుంటుంది.

B.Com వారికి:-

M.Com జనరల్ కోర్సు

M.Com కంప్యూటర్స్

I.CET Entrance ద్వారా MBA రెండు సం.రాల కోర్సు. ఈ కోర్సు చదివిన వారికి బ్యాంకింగ్, మార్కెటింగ్ రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

M.A. తెలుగు సాహిత్యం

M.A. ఆంగ్ల సాహిత్యం

వివిధ యూనివర్సిటీల అర్హతల ఆధారంగా P.G. ఇతర కోర్సులలో చేరే అవకాశం కల్పిస్తుంది. దీని కొరకు విశ్వ విద్యాలయాల నోటిఫికేషన్ లేదా హెల్ప్ లైన్ నెంబర్ లేదా సైట్ పరిశీలించవచ్చు.

B.Sc వారికి:-

B.Ed రెండు సం.రాల కోర్సు

B.P.Ed. ఒక సం. కోర్సు

Lawcet ప్రవేశ పరీక్ష ద్వారా 3 సం.రాల LLB కోర్సు

I CET ప్రవేశ పరీక్ష ద్వారా M.B.A. మరియు MCA చేసే అవకాశం. M.Sc PG కోర్సు రెండు సం.రాలు.

ఇందులో క్రింద ఇచ్చిన స్పెషలైజేషన్ సబ్జెక్టుతో పీ.జీ. చేయవచ్చును.

ఉదా: M.Sc Maths

M.Sc Physics

M.Sc Chemistry

M.Sc Botany

M.Sc Zoology

M.Sc Micro Biology

M.Sc Bio - Technology

M.Sc Bio-Chemistry

M.Sc Computer Science

M.Sc Geography

M.Sc Statistics

Journalism

Library Science

Geo Physics

M.A. (Telugu, Litt)

M.A. (English Litt)

### డిగ్రీ అర్హతతో రాష్ట్రస్థాయి ఉద్యోగవకాశాలు

1) Group -- I

2) Group -- II

3) Group -- III

4) D.A.O. (Divisional Accounts Officer)

5) S.I. Sub Inspector of Police (Civil) (Armed)

6) FRO Forest Range Officer

7) Panchayath Raj Secretary

8) TS Genco Asst. Manager, Sub Engineer

9) TSNPDCL Asst. Engineer, Sub Engineer

10) T.S Transco: Asst. Engineer, Sub Engineer

11) Legislature Service లో Egnlish Reporter

12) legislature సబ్ సర్వీస్‌లో అసిస్టెంట్ తెలుగు ట్రాన్స్‌లేటర్

13) అసిస్టెంట్ కాన్సర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఉద్యోగాలు

14) Group -- IV 1) జూనియర్ అసిస్టెంట్

2) జూనియర్ అకౌంటెంట్

3) జూనియర్ స్టెనో గ్రాఫర్

4) టైపిస్టులు

5) అసిస్టెంట్ టైపిస్టులు

పైన పేర్కొన్న ఉద్యోగాలకు సంబంధించిన సిలబస్, ప్రశ్న

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

పత్రాలను, సర్వీస్ కమీషన్ సైట్ లోను, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు మార్కెట్లో అందుబాటులో ఉంటాయి.

ఇవి కేవలం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటి పరీక్షల ద్వారా మెరిట్, రోస్టర్ ఆధారంగా భర్తీ చేయబడతాయని అభ్యర్థులు గమనించాలి. అప్పటి పరిస్థితులను బట్టి అదనంగా కొన్ని ఉద్యోగాలకు ప్రభుత్వం అవకాశం కల్పించవచ్చు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

సివిల్ సర్వీసెస్, ఇందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా పోస్టింగ్ ఇవ్వబడుతుంది. ఉదా:కలెక్టర్ లేదా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (SP), ఇతర సర్వీసులు కేటాయించబడుతాయి.

1) IBPS బ్యాంకింగ్ ఉద్యోగాలు (PO) clerks

2) RRC Railway Recruitment Cell

3) LIC జీవిత భీమా సంస్థలో D.O. (డెవలప్మెంట్ ఆఫీసర్స్)

4) JAO (జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్) BSNL సంస్థలో

5) Navy

7) FCI (Food Corporation of India)

8) S.S.C. (Staff Selection Commission)

9) NABARD లో Bank Manager

10) BDL (భారత్ డైనమిక్ లిమిటెడ్)

11) C.D.S. (Combined Defense Service)

12) Air Force

13) B.S.F. Army Jobs

14) Railway Protection Force RPF, CRPF, CISF, ITBP, Assam Raifills, NSG

15) Postal Department

16) HAL (Hindustan Aeronautical limited)

1) Technical

2) Marketing

3) Material Management

4) Legal Officer

5) H.R.

17) RBI (Reserve Bank of India), Bank Manager, PO మొదలైనవి

18) Singareni Calaries Sr.Asst, మొదలైనవి

19) NIN: National Institute of Nutrition.

1) Lab Technician

2) Data entry Operator

20) ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇందులో కూడా డిగ్రీ అర్హతల ఆధారంగా జియో సైంటిస్ట్, జియాలజిస్టులు, కెమిస్టుల ఉద్యోగాలను కేంద్ర ప్రభుత్వం భర్తీ చేస్తుంది.

21) జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్

22) పోర్ట్ ఆఫీసర్స్ (PORT Officer)

23) NTPC లో ఉద్యోగాలు

24) రైల్వే ఉద్యోగాలు అర్హతల ఆధారంగా

25) ఓరియంటల్ ఇన్సురెన్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల ఉద్యోగాలు

26) LIC హౌసింగ్‌లో ఏరియా మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, అసిస్టెంట్ క్లర్క్

27) Indian Air Force:- Flight, Technical, Ground Duty, Engineering, Cargo Department, మహిళలకు Air Hostes మొదలైన ఉద్యోగాలు

పైన పేర్కొన్న ఉద్యోగాలన్ని కూడా కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థలు, రాత పరీక్షలు, ఇంటర్వ్యూ మొదలైన భర్తీ విధానాల ద్వారా పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగా నియామకం చేస్తాయి. ఇవి కాకుండా కొన్ని అదనంగా కూడా ఆయా సందర్భాలను బట్టి అదనపు అవకాశాలను ప్రభుత్వం కల్పించే అవకాశం ఉంటుందని అభ్యర్థులు గమనించగలరు.

## ప్రైవేటు రంగంలో వుండే ఉద్యోగవకాశాలు

మొదట్లో చెప్పినట్లుగానే ప్రైవేటు రంగంలో ఉద్యోగం అంటేనే మన నైపుణ్యం మీద ఆధారపడి వుంటుంది. ఉద్యోగ సాధన అనేది డిగ్రీలో మీరు గోల్డ్ మెడల్ సాధించినా సమాజం పట్ల, సామాజిక స్థితిగతుల పట్ల ఏ మాత్రం పరిజ్ఞానం లేకున్నా వృధానే, అందుకే ఎప్పటికప్పుడు అభ్యర్థులు అప్డేట్ అవుతూ ఉండాలి. విషయ పరిజ్ఞానం, సామాజిక పరిజ్ఞానం, Skill Based Knowledge ఉండాలి. అలా ఉంటేనే మీకు ఏ ప్రైవేటు సంస్థ ఐన ఉద్యోగం ఇస్తుంది. అంతెందుకు మీరు డిగ్రీ పూర్తిచేసి B.Ed చేసినట్లయితే ఏ స్కూల్‌లో టీచర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళినా అక్కడ మీరు పాఠం చెప్పి పిల్లల్ని సంతృప్తి పరిస్తేనే ఉద్యోగం ఇస్తారు లేకుంటే ఇవ్వరు. అంతిమంగా చెప్పేదేమంటే అభ్యర్థి మూర్తిమత్వం, అన్ని అంశాలపై పట్టు వుండాలి.

ఉదా:- B.Sc Bio Technology

Mircro Biology

Bio Chemistry

వారికి ఫార్మసి కంపెనీలలో జూనియర్ కెమిస్ట్‌గా ఉద్యోగం ఇవ్వడానికి ఆయా కంపెనీలు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి విద్యార్థి ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు ఇస్తాయి.

B.Com ప్రైవేటు బ్యాంకులలో మేనేజర్, HR విభాగాలలో, Field supervisor మొదలైన ఉద్యోగాలు.

B.A :- జర్నలిస్టులు, సెక్యూరిటీ గార్డులు, ఆఫీసుల నిర్వహణ ట్యూటర్లుగా ఉద్యోగాలు లభించే అవకాశం వుంది. ఇవన్నీ కూడా అభ్యర్థి అభ్యాసనా సామర్థ్యాన్ని బట్టి ఆధారపడి వుంటాయి.

పై ఉద్యోగాలకు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన సమాచారం ఎలా తెలుసుకోవాలనే సందేహం విద్యార్థులకు లేదా నిరుద్యోగ అభ్యర్థులకు కల్గుతుంది. కాబట్టి ఏదైన ప్రామాణిక దినపత్రికను ప్రతిరోజు చదివే అలవాటు చేసుకోవాలి, అలాగే "సెంట్రల్ ఎంప్లాయిమెంట్ న్యూస్" అనే వారపత్రిక లేదా "కాంపిటీటివ్ సక్సెస్ రివ్యు" మ్యాగజైన్, యోజన (మాసపత్రిక) RC రెడ్డి వారి "వివేక్" (మాసపత్రిక) "ప్రైన్ ఇండియా" మాసపత్రిక, "విజేత కాంపిటీషన్స్" పక్ష పత్రిక మొదలైనవి తప్పకుండా ఫాలో కావాలి. ఉద్యోగ సమాచారానికి సంబంధించిన నోటిఫికేషన్లు, రాత పరీక్షల తేదీలు, సిలబస్, విషయ నిపుణుల సలహాలు సూచనలు ఇందులో ఉంటాయి. వాటిని పాటిస్తే ఖచ్చితంగా విజయం మీ వాకిట్లో నిలబడుతుంది.

ఆల్ ద బెస్ట్.






# దివ్య ఖుర్ఆన్- సర్వ మానవాళికి మార్గదర్శకం

దివ్య ఖుర్ఆన్ సర్వ మానవాళి మార్గదర్శకం కోసం అవతరించిందనీ జమాఅతె ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సలహామండలి సభ్యులు షాకిర్ హుసైన్ తెలిపారు. రమజాన్ మాసం సందర్భంగా జమాఅతె ఇస్లామీ హింద్ కడప శాఖ తరఫున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ సమావేశంలో ఆయన రమజాన్ మాస విశిష్ఠతను, ఉపవాసాల లక్ష్యాన్ని వివరించారు.

ఇస్లామీయ పండితులు మౌలానా ఆతిఫ్ ఫలాహి మాట్లాడుతూ, సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ మానవుడిని సృజించి ఇట్టే వదిలేయలేదని, మనిషి జీవితం గడపడానికి కావలసిన మార్గదర్శకత్వాన్ని దైవం తన ప్రవక్తల ద్వారా, ఆకాశ గ్రంథాల ద్వారా ప్రతి కాలంలోనూ ఇచ్చారన్నారు. ఈ పరంపరలోనే చిట్టచివరి ప్రవక్త అయిన ముహమ్మద్(స) వారిపై దివ్య ఖుర్ఆన్ అవతరించిందన్నారు. ఈ దివ్య ఖుర్ఆన్ అవతరణ రమజాన్ మాసంలోనే జరిగిందనీ, ఇందు కోసమే ఈ మాసంలో ముస్లిములు దైవానికి కృతజ్ఞతలు తెలుపడానికి నెలంతా ఉపవాసాలు పాటిస్తారనీ తెలిపారు.

ముఖ్యఅతిథి జనాబ్ ఖదీర్ మాట్లాడుతూ, ఉపవాస లక్ష్యం మనిషిలో దైవభీతిని, జవాబుదారీతనాన్ని పెంపొందించడమేనని తెలిపారు. మనిషి తాను స్వయంగా ఉపవాసం పాటించడం వల్ల పేదల ఆకలి బాధ తెలుస్తుందన్నారు. మతం మనిషిని, మానవత్వాన్ని బోధిస్తుందని కాని నేడు కొందరు మతం ద్వారా రాజకీయ స్వలాభం కోసం విద్వేషాన్ని సమాజంలో రెచ్చగొడుతున్నారని, ఇది ఎంతో శోచనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జమాఅతె ఇస్లామీ హింద్ స్థానిక అధ్యక్షులు ఖాదర్ వలీ, సంస్థ సభ్యులు, కార్యకర్తలు, హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

# ఇస్లాంలో మానసిక వ్యాధులకు సమగ్ర విధానం



ముహమ్మద్ అజ్గర్ అలి

**ప్రపంచ వ్యాప్తంగా** మానసిక ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న స్త్రీ-పురుషుల సంఖ్య ఆందోళనకరమైన రీతిలో పెరుగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2019లో ప్రతి 8 మందిలో ఒకరు లేదా ప్రపంచవ్యాప్తంగా 970 మిలియన్ల మంది మానసిక రుగ్మతతో జీవిస్తున్నారని, ఆందోళన, డిప్రెషన్ సర్వ సాధారణమని అంచనా వేసింది.

కోవిడ్-19 మహమ్మారి తర్వాత మానసిక రుగ్మత గణాంకాలు గణనీయంగా పెరిగాయి. ఆందోళన, డిప్రెషన్ కాకుండా, ఇతర మానసిక రుగ్మతలు అనగా బైపోలార్, స్కిజోఫ్రెనియా, ఈటింగ్ డిజార్డర్, ఆటిజం, కండక్ట్ డిజార్డర్, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ (OCD) మొదలైనవి పెరిగాయి. మానసిక వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య అంచనా వేసిన దానికంటే ఎక్కువగా ఉండవచ్చు, ఎందుకంటే బాధపడుతున్న వారిలో చాలామంది అర్హత కలిగిన వైద్య నిపుణుల నుండి సలహాలు కాని, సహాయం కాని తీసుకోవడం లేదు.

మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు మానసిక అనారోగ్యం కళంకంగా భావించడం ప్రధాన సమస్య. శారీరక వైకల్యం ఉన్న వ్యక్తి వైకల్యం సమాజానికి కనిపిస్తుంది. సానుభూతిని, అవగాహనను కలిగిస్తుంది. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి బాధ కనిపించదు. చాలా తరచుగా తప్పుగా అర్థం చేసుకోబడతారు. ప్రతికూల వ్యాఖ్యలు, ప్రతిచర్యలను ఎదుర్కొం టారు. సాధారణంగా చెప్పాలంటే, వివాహానంతరం స్త్రీలు ఎక్కువ బాధపడతారు, వారిలో కొందరు ఇన్టాలరెంట్ భర్త / అత్తమామల మధ్య జీవించవలసి ఉంటుంది.

### పబ్లిక్ స్టిగ్మా, సెల్ఫ్ స్టిగ్మా

మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల పట్ల వైఖరి, పక్షపాతం, వివక్ష, మీడియాలో ప్రతికూల చిత్రీకరణ కారణంగా ఒక కళంకం లేదా స్టిగ్మా వ్యక్తులను బాధిస్తుంది. వ్యక్తి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతాడు, ప్రతి లోపానికి/ గ్రహించిన తప్పుకు తనను తాను నిందించుకుంటాడు కాబట్టి ఆత్మ నిందకు గురవుతాడు. ఇది వినాశకరమైనది.

ఆత్మనింద అనేది సామాజిక ఒత్తిడి వల్ల పుడుతుంది. మానసిక సమస్యలతో బాధపడుతున్న చాలా మంది తమ బంధువులు, స్నేహితుల మధ్య మానసిక రోగి అనే లేబుల్ తగలకుండా ఉండటానికి మానసిక ఆరోగ్య ఆసుపత్రులను సంప్రదించరు.

భారతదేశంలోని కులం, మతం, మానసిక ఆరోగ్యంపై జనాభా స్థాయి వివరాలను అందించే ఒక అధ్యయనం ఆశిష్ గుప్తా, డయాన్ కాఫీలు చేశారు. ఆశిష్ గుప్తా, డయాన్ కాఫీ ఉన్నత

కుల హిందువుల కంటే షెడ్యూల్డ్ కులాలు, ముస్లింలు ఆత్మనింద ఒత్తిడి కలిగి ఉన్నారని నివేదించారు. అగ్ర కులాల హిందువులతో పోల్చితే ముస్లిములలో ఆందోళన, ఒత్తిడి అవకాశం చాలా ఎక్కువగా ఉంది (భారతదేశంలో కులం, మతం, మానసిక ఆరోగ్యం: 2020)

మానసిక ఆరోగ్య సమస్యల పట్ల ఇస్లాం ఏమంటుంది? చాలా మంది ముస్లింలు (అందరూ కాకపోయినా) ఇది అల్లాహ్ నుండి వచ్చిన పరీక్ష అని లేదా అతీంద్రియ శక్తులు (జిన్‌లు, నజర్) ప్రభావం వల్ల అని నమ్ముతారు. అనేక మూఢనమ్మకాలు కూడా ఉన్నాయి. తల్లిదండ్రుల మొదటి ప్రతిచర్య పిల్లవాడిని ఆమిల్ వద్దకు, తాయెత్తులు వేసేవాని వద్దకు తీసుకెళ్లడం.

వ్యక్తులలో నిరాశ, ఆందోళన, OCD వంటి మానసిక ఆరోగ్య సమస్యలు అనారోగ్యాలుగా గుర్తించబడవు. ఈ సమస్యలు లేని ఇతర వ్యక్తుల మాదిరిగానే వారు తమ విధులను సాధారణంగా నిర్వర్తించాలని ప్రజలు ఆశిస్తున్నారు. మందులు వాడుతున్న వారిలో చాలా మంది మాత్రల దుష్ప్రభావాలను (సాధారణంగా మగత, అధిక నిద్ర) ఎదుర్కోవలసి ఉంటుంది.

ఇస్లామిక్ సైకాలజీ గురించి చాలా మందికి తెలియదు. మధ్యయుగ కాలంలో మానసిక అనారోగ్యం చికిత్సను అల్టిబ్ అల్-రుహానీ (ఆత్మ స్వస్థత) అని పిలిచేవారు. మానసిక రోగులను క్లాసికల్ అరబిక్‌లో "మజ్నూన్" అని పిలుస్తారు.

అల్ రాజీ (865-925), (పాశ్చాత్య ప్రపంచంలో రేజేస్ అని పిలుస్తారు) మానసిక అనారోగ్యం, మానసిక చికిత్సపై వ్రాసిన ప్రపంచంలో మొదటి వ్యక్తి. అల్ రాజీ బాగ్దాద్ హాస్పిటల్ ప్రధాన వైద్యుడు. బాగ్దాద్ హాస్పిటల్ ప్రపంచంలోనే మానసిక చికిత్సా విభాగాలను కలిగి ఉన్న మొదటి ఆసుపత్రులలో ఒకటి. అల్ రాజీ మానసిక వార్డులకు డైరెక్టర్‌గా ఉన్నాడు. అల్ రాజీ రచనలు ఎల్-మన్సూరి, అల్-హవి మానసిక వ్యాధుల చికిత్సకు సంబంధించినవి.

ఇబ్న్ సినా (980-1030) (పశ్చిమాన అవిసెన్నా అని పిలుస్తారు) ఇబ్న్ సినా "అల్-కనున్-ఫిత్‌తిబ్" (కానన్ ఆఫ్ మెడిసిన్) రచయిత "అల్-కనున్-ఫిత్‌తిబ్" ఇస్లామిక్ సైకాలజీ లేదా ఇల్మ్-అల్నాఫ్స్, నిద్రలేమి, మూర్ఛ, నిరాశకు సంబంధించిన చికిత్సలను వివరిస్తుంది. మానసిక లేదా భావోద్వేగ ఒత్తిడి వల్ల కలిగే శరీర లక్షణాలకు సంబంధించిన సైకోసోమాటిక్ మెడిసిన్ రంగంలో ఇబ్న్ సినా మార్గదర్శకుడు.

అబూ జైద్ అల్-బలి (850-934) ఇస్లామిక్ ప్రపంచంలో శాస్త్రీయ అభివృద్ధి యుగంలో మరొక మార్గదర్శక ముస్లిం మనస్తత్వవేత్త. అబూ జైద్ శరీరం, మనస్సును మొత్తంగా పరిగణించే భావనను ప్రోత్సహించాడు. అబూ జైద్ అల్-బలి, కాగ్నిటివ్ థెరపీ స్థాపకుడు. కాగ్నిటివ్ థెరపీ రోగులను సానుకూలంగా ఆలోచించేలా ప్రేరేపించింది.

13వ శతాబ్దంలో ముస్లింలచే స్థాపించబడిన బిమరిస్తాన్‌లు (ఆసుపత్రులు) మానసిక రోగులకు ప్రత్యేక వార్డులను కలిగి ఉన్నాయి. అలాంటి ఆసుపత్రులలోని వైద్యులు వారి రోగులకు మనస్సు అనారోగ్యం, శరీరంలోని సమస్యల మధ్య సంబంధాన్ని గుర్తించి చికిత్స చేస్తారు. మానసిక అనారోగ్యం కేవలం మందులతో మాత్రమే కాకుండా, స్నానాలు, టాక్ థెరపీ, హిజామా (కప్పింగ్), అరోమాథెరపీలు ఉన్నాయి. ఇప్పుడు ఆధునిక, పద్ధతులుగా చెప్పబడుతున్న ఈ పద్ధతులు నిజానికి మధ్యయుగ కాలంలో ముస్లిం మనస్తత్వవేత్తలచే ఉపయోగించబడ్డాయి.

అబూ జైద్ అల్-బలీ ప్రకారం ఆసుపత్రుల్లో మానసిక వ్యాధులకు వైద్యపరంగా చికిత్స చేయడానికి ఒక సమగ్ర విధానాన్ని


ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:

1800 572 3000

రూపొందించింది. మానసిక వైద్యులు, మనస్తత్వవేత్తల సేవలను ముఖ్యంగా పేద వర్గాలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలి. మందులతో పాటు, మానసిక వ్యాధులతో బాధపడుతున్న ముస్లింలకు వారి సమస్యలను పరిష్కరించడానికి ఒక సమగ్ర విధానాన్ని అభివృద్ధి చేయాలని ఉలేమా, పండితులు సలహా ఇచ్చారు.

మానసిక వ్యాధులు కలిగిన వారి బాధలను తగ్గించడంలో, త్వరిత ఉపశమనం పొందడంలో వారికి సహాయపడే క్రింది పద్ధతులను అదనంగా అవలంబించాలని సలహా ఇచ్చారు.

1) అల్లాహ్‌పై బలమైన విశ్వాసం కలిగి ఉండడం 2) అల్లాహ్‌ను నిరంతరం స్మరించటం. అంటే, జిక్ర్ 3) శ్రద్ధగా నమాజ్ చేయడం 4) దుఆ 5) ప్రతి కష్టానికి సానుకూల దృక్పథాన్ని పెంపొందించడానికి ప్రయత్నించడం.

మానసిక అనారోగ్యాన్ని స్టిగ్మాగా పరిగణించకూడదు. మానసిక అనారోగ్యాన్ని శరీరానికి సంబంధించిన ఇతర అనారోగ్యం వలె పరిగణించాలి. దానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలి. బాధపడేవారి బాధలను తగ్గించడమే కాకుండా కోలుకునే ప్రక్రియలో కూడా వారికి సహాయపడుతుంది.

## కడప జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో రమజాన్ రేషన్ కిట్ల పంపిణీ



రమజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని అవసరార్థులకు స్థానిక బెల్లంమండిలోని మదర్సా యే జొహ్రాలో రమజాన్ మాసంలో రేషన్ కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర ప్రతినిధి మండలి సభ్యులు జనాబ్ మౌలానా ఇందాదుల్లా హుసేని నిజామీ, నగర ప్రముఖ డాక్టర్‌లు అతిథులుగా పాల్గొని అవసరార్థులకు రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమాఅత్ కార్యకర్తల కృషిని నగర ప్రముఖులు కొనియాడారు. రేషన్ కిట్లను అవసరార్థులకు మాత్రమే అందేవిధంగా సర్వే నిర్వహించి వారి ఇంటి వద్దకు వెళ్ళి నిర్ధారించిన తర్వాతనే రేషన్ కిట్లను పంపిణీ చేశామని స్థానిక అధ్యక్షులు జనాబ్ ఖాదర్ వలి తెలిపారు. రూ. 2500 విలువ గల 200 రేషన్ కిట్లను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఈ రేషన్ కిట్ల కోసం విరాళాలు అందజేసిన దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.


### చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# దివ్య ఖుర్‌ఆన్ అవతరించిన నెల పవిత్ర రమజాన్

ముహమ్మద్ వహీదుద్దీన్

**అంతిమ** పవిత్ర గ్రంథం దివ్య ఖుర్‌ఆన్ పవిత్ర రమజాన్ మాసంలో అవతరించింది. ఇది చిట్టచివరి ఆకాశ గ్రంథం. దీనిని ఆగి ఆగి చదవాలి అర్థం చేసుకుంటూ... అవగాహన చేసుకుంటూ చదివి మన నిత్య జీవితంలో పటిష్టంగా అమలు పరచాలి. ఇతరులకు దివ్య ఖుర్‌ఆన్ బోధనలు ఖచ్చితంగా చేరవేయాలి. దీని తర్వాత మరే దివ్య గ్రంథం రాదు. ప్రళయం వరకు ఎటువంటి మార్పులు చేర్పులు ఉండవు. ఎందుకంటే స్వయంగా అల్లాహ్‌నే దీనిని రక్షించే బాధ్యత తీసుకున్నాడు. ప్రపంచంలో ఎక్కువగా చదివే గ్రంథం దివ్య ఖుర్‌ఆన్ మాత్రమే.

దివ్య ఖుర్‌ఆన్ చదవడం వల్ల మనసుకు ప్రశాంతత కలుగుతుంది. మన జీవితంలో జరిగే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. సరైన మార్గం కనిపిస్తుంది. మనిషిని కాంతి వైపు నడిపిస్తుంది. చెడులకు బహు దూరంగా ఉంచుతుంది. మంచి వైపు, పుణ్య కార్యాల వైపు వేగంగా అడుగులేపిస్తుంది. మనిషిలో మాట్లాడే పద్ధతి, క్రమశిక్షణ ఏర్పడుతుంది. పెద్దలకు ఇచ్చే గౌరవం, తల్లిదండ్రుల సేవ, భార్యపైన ప్రేమ, చిన్న పిల్లలపై దయ చూపడం, దానధర్మాలు చేయడం వంటి ఉత్తమ గుణాలు జనిస్తాయి. కుటుంబంలో ఆనందం ఏర్పడుతుంది. సమాజంలో మంచి మార్పు వస్తుంది.

అంతిమ దివ్య ఖుర్‌ఆన్, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)పై 23 సంవత్సరాలలో మొత్తం ఖుర్‌ఆన్ అవతరించింది. సందర్భానుసారం ఆయతులు అవతరింపబడ్డాయి. అల్లాహ్‌నే దీనిని స్వయంగా రచించాడు. దివ్య ఖుర్‌ఆన్‌ను, దైవప్రవక్త(స) సున్నత్‌లను దృఢంగా పట్టుకుని నడిచేవారు ఎప్పటికీ చీకటిలో ఉండరు. అటువంటి వారే ఇహ పరలోకంలో సాఫల్యం పొందుతారు. స్వర్గ వనాలలో ఉన్నతమైన స్థానాలలో ఉంటారు.

ఖుర్‌ఆన్ గ్రంథాన్ని ఎలా పఠించాలో అల్లాహ్ ఈవిధంగా తెలుపుతున్నాడు :


మీరు ఖురాను పఠనం ప్రారంభించినప్పుడు శాపగ్రస్తుడైన షైతాను బారినుండి అల్లాహ్ శరణు కోరుకొనండి. విశ్వసించి తమ ప్రభువును నమ్ముకున్న వారిపై వాడి అధికారం సాగదు. వాడిని తమ సంరక్షకుడుగా చేసుకుని వాడి మోసానికి గురిఅయి షిర్కు చేసేవారిపైనే వాడి అధికారం సాగుతుంది. (16:98-100)

కనుక (అది) కాదు, నక్షత్రాల స్థానాలు, కక్ష్యలు సాక్షిగా చెబుతున్నాము. మీరు తెలుసుకుంటే, ఇది చాలా పెద్ద ప్రమాణం; ఇది ఒక మహోన్నతమైన ఖుర్‌ఆన్ ఒక సురక్షితమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది. దానిని పరిశుద్ధులు తప్ప మరెవరూ తాకలేరు. ఇది సకల లోకాల ప్రభువు అవతరింపజేసినటువంటిది. (అల్ వాఖిఅహ్ 56: 75-80)

ఈ ఖుర్‌ఆన్‌ను మేము సత్యంతో అవతరింపజేశాము. సత్యంతోనే అది అవతరించింది. ప్రవక్తా! (విశ్వాసులకు) శుభవార్త అందించటానికి (అవిశ్వాసులకు) హెచ్చరిక చెయ్యటానికి తప్ప మేము నిన్ను మరొక పనికొరకు పంపలేదు. మేము ఈ ఖుర్‌ఆన్‌ను నెమ్మదిగా ప్రజలకు వినిపించాలని, మేము దానిని సందర్భాన్ని బట్టి క్రమక్రమంగా అవతరింపజేశాము. ప్రవక్తా! వారితో ఇలా అను: మీరు దీనిని నమ్మండి, నమ్మకపోండి. ఇదివరకు జ్ఞానం ఇవ్వబడిన వారికి దానిని వినిపించినప్పుడు వారు ముఖాన్ని నేలకు ఆనించి సాష్టాంగపడి ముక్తకంఠంతో ఇలా అంటారు : 'మా ప్రభువు పరిశుద్ధుడు, ఆయన వాగ్దానం పూర్తయి తీరవలసిందే'' వారు ముఖాన్ని నేలకు ఆనించి విలపిస్తూ పడిపోతారు. దానిని విన్న తరువాత వారి అణుకువ మరింత పెరుగుతుంది. (బనీ ఇస్రాయీల్ 17: 105-109)

చూడు, ఖుర్‌ఆన్ చదవటంలో తొందరపడకు, నీ వైపునకు దాని వహీ (అవతరణ) పూర్తి కానంతవరకు, ఇలా ప్రార్థించు; 'ఓ ప్రభూ! నాకు మరింత జ్ఞానం ప్రసాదించు' (తాహా 20: 114)

ఓ ప్రవక్తా! ఈ వహీని (సందేశాన్ని) త్వరత్వరగా జ్ఞాపకం చేసుకోవటానికి నీ నాలుకను ఆడిరచకు దీనిని జ్ఞాపకం చేయించటం, చదివించటం మా బాధ్యత. కనుక మేము దీనిని పఠిస్తున్నప్పుడు, నీవు ఆ పారాయణాన్ని శ్రద్ధగా ఆలకించు. ఇంకా దాని భావం అర్థమయ్యేలా చేయటం కూడ మా బాధ్యతే. (75: 16-19)




**నా కెప్పుడు** జ్వరమొచ్చినా మా ఊరి లైబ్రరీ బాగా గుర్తొస్తుం టుంది. నా జ్వరానికి మా లైబ్రరీకి మధ్య ఈ బీరకాయ పీచు బాంధవ్యమేమిటో నాక్కూడా పూర్తిగా తెలియదు, కాని చిన్నప్పుడు జ్వరం వచ్చినప్పుడు నవారు మంచం మీద రగ్గు కప్పుకుని కూర్చుని, లైబ్రరీ మాస్టారును బతిమాలి తెచ్చుకున్న పాత పుస్తకం చదువుకున్న క్షణాలే కళ్ళముందుంటాయి. చదవడం అంటే మామూలుగా చదవడం కూడా కాదు, ఏదో ధార్మిక గ్రంథం చదువుతున్నట్లు చాలా సీరియస్సుగా వెనక్కి ముందుకి ఊగుతూ చదవడం. మా నాయనమ్మకు ఒళ్ళుమండి, జ్వరంలో నిద్రపోక చెత్త పుస్తకాలన్ని చదివి అవే పలవరిస్తుంటావ్ అంటూ చీవాట్లు పెట్టేది. మధ్యమధ్యలో ఏదో కాషాయం తెచ్చి బలవంతంగా తాగమనేది. ఆ కాషాయం తాగుతూ, చలిజ్వరానికి వణుకుతూ, పుస్తకం చదవడంలో ఉన్న మజా ఉంది చూడు.. అబ్బబ్బా.. మజాయే మజా...

మా లైబ్రరీతో నాకున్న సంబంధం అలాంటిది మరి. స్కూలు నుంచి రాగానే కనీసం ముఖం కడుక్కోవడమూ, కాళ్ళు కడుక్కో వడమూ వగైరాలేవీ ఉండేవి కావు, పుస్తకాల సంచి విసిరి కొట్టి లైబ్రరీకి పరుగెత్తడమే. మొదట్లో నేను లైబ్రరీకి ఎందుకు వెళ్ళేవాడి నంటే, పెద్ద పుస్తకాలు చదివేయాలన్న వీర జ్ఞానతృష్ణ ఏం కాదు. అక్కడ కొన్ని బొమ్మల పుస్తకాలు ఉండేవి. అవి చూడ్డానికి వెళ్ళే వాడిని. చాలా పుస్తకాలుండేవి. పైగా పాత పుస్తకాల్లో ఉండే మత్తయిన వాసనంటే నాకు చాలా ఇష్టం. లైబ్రరీకి పరుగెత్తడానికి మరో కారణం కూడా ఉంది. లైబ్రరీ వెనుక ఒక ప్లేగ్రౌండు ఉండేది. బ్యాడ్మింటన్ నెట్ ఉండేది. సాయంత్రమైతే ఊళ్ళో కుర్రాళ్ళు, పెద్దవాళ్ళు అక్కడికి వచ్చి బ్యాడ్మింటన్ ఆడేవారు. లైబ్రరీ వెనుక గోడకు రెండు కిటికీలు ఉండేవి. ఆ గోడలు మామూలు గోడలు కాదు, పాతకాలం గోడలు, ఒక్కో గోడ కనీసం అడుగున్నర వెడల్పు ఉండేది. ఆ కిటికీ తెరిస్తే ఆ కిటికీలో మనం కూర్చోవచ్చు. హాయిగా ఒకవైపు ఆనుకుని, రెండు కాళ్ళు మరోవైపు పెట్టి దర్జాగా కూర్చుని బ్యాడ్మింటన్ చూడొచ్చు. ఎడమవైపు కిటికీ నా స్వంతం అయిపోయింది.

లైబ్రరీకి వెళ్ళే అలవాటు తర్వాత్తర్వాత అక్కడ చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు లాంటి పిల్లల పుస్తకాలు చదివేలా చేసింది. ఊళ్ళో కొత్తగా వచ్చిన ప్రతి లైబ్రరీ మాస్టారు మనకు ఫ్రెండ్ అయిపోయేవారు. అవ్వక ఏం చేస్తాడు. ఇది బలవంతపు ఫ్రెండ్ షిప్పు. ఎప్పుడు చూసినా అక్కడే పడి ఉండేవాడితో మాటామంతి ఎలాగూ కలుస్తాయి కదా. లైబ్రరీలో చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు వంటి పుస్తకాల పాత కాపీలను బౌండు చేయించి ఉంచేవారు. అందులో సీరియల్స్ అంటే మనకు చచ్చే ఇష్టం. పైగా వడ్డాది పాపయ్య వేసే బొమ్మలంటే కూడా చాలా

ఇష్టం. ఆయన రాజకుమారి బొమ్మను సూపరుగా గీస్తాడు. ఆ రాజకుమారిని చూడ్డానికైనా లైబ్రరీకి వెళ్ళాల్సిందే మరి. నా రీడింగ్ స్కిల్స్ మొదటి నుంచి చాలా బాగుండేవి. చాలా వేగంగా చదవడం మొదటి నుంచి అలవాటు. చాలా వేగంగా చదివే అలవాటు ఉన్నందువల్ల కొంత కాలానికే చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు కాపీలు బౌండు చేసినవన్నీ అయిపోయాయి. ఇంకా పాతవేమైనా ఉన్నాయేమో అని వెదుకుతుండేవాడిని. ఒకసారి లైబ్రరీ మాస్టారు, ఆయన పేరు గుర్తులేదు, నేను ర్యాకుల మధ్య పుస్తకాలు వెదుకుతుంటే వెనక నుంచి వచ్చి భుజం మీద చెయ్యేశాడు. ఏం వెదుకుతున్నావేంటి అనడిగాడు. అప్పటికి నేను హైస్కూలులో ఉన్నాను. చందమామ పాత కాపీలు అని జవాబిచ్చాను. ఇంకెంత కాలం ఆ చందమామలు చదువుతావు? అని ర్యాకు పైన చెయ్యేసి ఒక పుస్తకం తీశాడు. అది మాక్సిమ్ గోర్కి కథలు. ఇది కూర్చుని చదువు అని ఇచ్చాడు. ఆ లైబ్రరీలో మన స్పెషాలిటీ ఏంటంటే, ఎవరైనా పుస్తకం తీసుకుంటే రిజిష్టరులో రాసి తీసుకుని చదవాలి. కాని గంటకో చందమామ తీసుకునే నాలాంటోడిని రాయమంటే అదే పెద్ద పనవుతుందని, నువ్వు రాయాల్సిన అవసరం లేదురా బాబు అని ఎప్పుడో మినహాయింపు ఇచ్చేశారు. కాబట్టి మనం రిజిష్టరులో రాయక్కర్లేదు. ఆ పుస్తకం పట్టుకుని కిటికీలో కూర్చున్నాను. ఆ కిటికీ నా స్వంతమని చెప్పా కదా. పాపం ఎవరు అక్కడ కూర్చునే వారు కాదు. అప్పుడప్పుడు కొత్తగా వచ్చిన అమ్మాయిలు ఎవరైనా అక్కడ బాగుందని కూర్చున్నా నేను నిర్దాక్షిణ్యంగా అది నా ప్లేసు అని లేపేసే వాడిని. మాక్సిమ్ గోర్కి కథలు చదివిన తర్వాత సోవియట్ సాహిత్యం ఒక పిచ్చిలా పట్టుకుంది. ఎన్ని కథలు. ఎంత జీవితం. పిల్లలు సోవియట్లయినా, ఇండియన్లయినా పిల్లలు పిల్లలే. మనుష్యులు మనుష్యులే. సోవియట్ సాహిత్యం ఒక అద్భుత ప్రపంచం.

సోవియట్ పుస్తకాల గురించి మాట్లాడుతున్నప్పుడు సోవియట్ భూమి గురించి కూడా చెప్పాలి. సోవియట్ ల్యాండ్ అని ఇంగ్లీషులో వచ్చేది. భారతదేశంలోని అన్ని భాషల్లో వచ్చేదనుకుంటాను. ఈ పత్రిక మొదటి కాపి నేను డబ్బులు పెట్టి కొన్నది కాదు. కొట్టేసింది. చదవడానికి కొట్టేయడం జరగలేదు. స్కూలు పుస్తకాలకు అట్టలేసుకోడానికి. సోవియట్ భూమి మంచి ఆర్ట్ పేపరుపై ముద్రించేవారు. పుస్తకాలకు అట్టలేసుకోడానికి భలే బాగుందే అని కొట్టేశాం. అట్టలేస్తున్నప్పుడు అందులో ఒక ఐటమ్‌పై దృష్టిపడింది. అది చదివాక. ఇక మిగిలిన పేజీలు కూడా చదివేశా. ఇదేదో బాగుందే అనిపించింది. ఈ పుస్తకం ఎవరి దగ్గర కొట్టేశానబ్బా అని ఆలోచిస్తే మా తెలుగు మాస్టారు దగ్గర కొట్టేశానని గుర్తొచ్చింది. ఆయన కాస్త చండశాసనుడు. చిరునవ్వు నవ్వడం తప్ప గట్టిగా నవ్వడం నేనెప్పుడు చూడలేదు. భారీ విగ్రహం. తెల్లగా ఉండేవాడు. వైట్ అండ్ వైట్ వేసుకునేవాడు. చాలా నీట్‌గా ఉండేవాడు. గడియారం ముల్లులాంటి క్రమశిక్షణ. అన్నింటికి మించి అప్పట్లో నాకు తెలిసిన కమ్యునిజం ఆయనే. ఈ పుస్తకం బాగుంది కాబట్టి ఆయన దగ్గరకెళ్ళాల్సిందే. మర్నాడు తిన్నగా ఆయనింటికి వెళ్ళిపోయాను. అదేంటో స్కూల్లో సీరియస్‌గా పాఠాలు చెప్పే మనిషి ఇంట్లో నవ్వుతూ మాట్లాడాడు. కమ్యునిస్టులు అంతే గామోసు అనుకున్నా. సార్ సోవియట్ భూమి పుస్తకాలు కావాలి. చదవాలనుకుంటున్నా అన్నాను. సరే పట్టుకెళ్ళు అని వాళ్ళింట్లో ఉన్న పాత కాపీలు ఇచ్చారు. అవి తీసుకుని, పాత కాపీలు కాదు సార్ నేను కూడా చందా కట్టాలనుకుంటున్నా అన్నాను. అదెంత ఉంటుందో అని లోపల్లోపల పీకుతూనే ఉంది. వెరీగుడ్... వెరీగుడ్ అన్నాడాయన. వెంటనే మనీఆర్డర్ ఫారం తెప్పించి, నా అడ్రసు రాయించి. మనీఆర్డరు చేయించేశారు. ఆ డబ్బులు నేనిచ్చానా, ఆయనే పెట్టుకున్నాడా అన్నది కూడా గుర్తులేదు. అలా ఆయన సోవియట్ భూమితో పరిచయం చేయించాడు. ఆ తర్వాత చాలా సంవత్సరాలు సోవియట్ భూమి రెగ్యులర్‌గా వస్తూనే ఉండేది.

సోవియట్ సాహిత్యం లైబ్రరీలో చదవడం అలవాటైన తర్వాత నెమ్మదిగా మిగిలిన పుస్తకాలపై దృష్టిపడింది. మా లైబ్రరీ నిజంగానే గొప్ప జ్ఞానభాండాగారం. రిఫరెన్సు సెక్షనులో చాలా పుస్తకాలుండేవి. మనం అక్కడ రెగ్యులర్ ఫకీరు కాబట్టి లైబ్రరీ మాస్టర్లు కూడా విసిగిపోయి, రిఫరెన్సు పుస్తకాలు కూడా ఒక్కోసారి సర్లేరా ఇంట్లో చదివి రేపు తెచ్చివ్వు, ఇప్పుడు లైబ్రరీ కట్టేయాలని చెప్పిన సందర్భాలున్నాయి. అక్కడ నేను చూసిన లైబ్రరీ మాస్టార్లందరూ పఠనాసక్తిని పెంచడానికి ప్రయత్నించేవారే. కొందరు పుస్తకాల కంటెంట్ గురించి కూడా మాతో మాట్లాడేవారు, డిస్కస్ చేసేవారు. నిజానికి మేం అప్పుడు చిన్న పిల్లలం. లైబ్రరీ మాస్టరు లైబ్రరీ కట్టేసి వెళుతూ, బయట సైకిలు మీద ఒక కాలు ఆన్చి ఏదో పుస్తకం గురించి డిస్కస్ చేసిన దృశ్యాలు ఇప్పటికీ నా కళ్ళ ముందున్నాయి. ఇలాంటి వారే పుస్తకాల పురుగులా మార్చేశారు. అందుకు ధన్యవాదాలు చెప్పాలి.

ఇంత చేస్తే నాకు లైబ్రరీ కార్డు ఎప్పుడూ లేదు. కార్డు లేకపోయినా లైబ్రరీ మాస్టార్లు నాకు ఒక్క పుస్తకం వరకు మినహాయింపు ఇచ్చేవారు. ఆ ఒక్క పుస్తకం మనకు చాలదు కదా. అందుకని ఏం చేయాలా అని ప్లానేస్తుంటే, మా పొరుగున ఉండే లక్ష్మీ ఆంటీ కార్డు గుర్తొచ్చింది. ఆవిడకు నవల్లు చదవడం ఇంటరెస్టు.

ఒకసారి కార్డు నాకిచ్చి కొత్త నవల తీసుకురమ్మంది. నేను వెళ్ళి తెన్నేటి సూరి అనువాదం చంగీజ్‌ఖాన్ తెచ్చిచ్చాను. ఇదేం నవలరా .. యద్దనపూడి సులోచనరాణి నవలలు తప్ప మరేమీ తీసుకురాకు అని వార్నింగిచ్చేసింది. సో.. అలా తెచ్చిన చంగీజ్ ఖాన్ నేనే చదివేశాను. చంగీజ్ ఖాన్ నుంచి మొదలైన ఈ అనువాదాల అధ్యయనం అదో పిచ్చిలా కొనసాగింది. గోర్కి రాసిన అమ్మ, టెడ్ అలెన్ రక్తాశ్రువులు, కిషన్ చందర్, ప్రేమ్ చంద్ పుస్తకాలు వరుసగా అనేక పుస్తకాలు, దొరికిన ప్రతి పుస్తకం చదవడమే. కామ్రేడ్ కొట్నీస్ గురించి చదివింది కూడా అప్పట్లోనే. ఆ తర్వాత కమ్యునిస్టు సాహిత్యంపై ఆసక్తి కూడా అదే పిచ్చిగా కొనసాగింది. అప్పట్లోనే ఏడుతరాలు నవల వచ్చింది. మా లైబ్రరీలోకి రాలేదు. దాన్ని సంపాదించడానికి నానా ప్రయాస పడ్డా. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం, లత నవలలు, మాలతీ చందూర్, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, అంపశయ్య నవీన్, అడవి బాపిరాజు, ఉన్నవ లక్ష్మీ నారాయణ, బుచ్చిబాబు, కప్పగంతుల, ఏనుగుల వీరాస్వామయ్య, మల్లాది వెంకట కృష్ణమూర్తి, యండమూరి వీరేంద్రనాథ్... ఇవి గుర్తున్న పేర్లు మాత్రమే. మా లైబ్రరీ పుణ్యమా అని ఎన్ని పుస్తకాలు అప్పట్లోనే చదవడానికి దొరికాయో చెప్పలేను. గమనించవలసిన విషయమేమంటే ఇందులో కవిత్వ పుస్తకం ఒక్కటి కూడా లేదు...?

మా పొరుగింటి ఆంటీ యద్దనపూడి నవలలు తప్ప మరేమీ తేవద్దని వార్నింగిచ్చింది కాబట్టి ఇక తప్పనిసరయి, ఏదీ దొరక్కపోతే అవే చదివాను. ఎందుకో యద్దనపూడి నవలలు నన్ను ఆకట్టుకోలేదు. అందులో హీరో ఎప్పుడు ఆరడుగులు ఉంటాడు. నేను మరో రెండు జన్మలెత్తినా ఆరడుగుల హైటు అందుకోవడం అయ్యే పని కాదని అప్పుడే అనుకున్నా. పైగా మనకు సైకిలు నడపడమే సరిగా రాదు, ఆ హీరో పడవంత కారు నడుపుతాడు. కాని యద్దనపూడి సులోచనరాణి నవలల్లో అలా చదివిన ఒక నవల నాకు బాగా గుర్తుంది. నవల పేరు మరిచిపోయాను కాని కంటెంట్ చాలా ఆసక్తికరంగా చదివించేలా ఉంది. హీరో డబల్ రోల్. ఒకడు అమ్మకూచి... ఈ పదం మొదటిసారి ఆ నవల్లోనే చదివాను. అమాయకుడు. మరొకడు తెలివైనవాడు. ఒక హీరోయిన్. ఈ త్రికోణ కథను నడిపిన తీరు చాలా బాగుంది. ముఖ్యంగా మధ్యతరగతి కాకపోయిన ఉన్నత మధ్యతరగతి జీవితాలకు కాస్త దగ్గరగా ఉన్నట్లనిపించింది. కాని చాలా కాలం నాకు గుర్తుండిపోయిన నవలలు ఒకటి తిరిగి వచ్చిన గాడిద, రెండోది జూల్స్ వెర్న్ నవలకు అనువాదం భూగర్భంలో సాహసయాత్ర. జూల్స్ వెర్న్ రాసిన ఎనభై రోజుల్లో భూమిని చుట్టి రావడం కూడా ఆసక్తిదాయకమైన నవలే. హెచ్.జీ. వేల్స్ సైన్సు ఫిక్షన్లు, మార్క్ ట్వయిన్ రచనలు మరిచిపోలేనివి. ఈ సైన్స్ ఫిక్షన్లు చదువుతున్నప్పుడు నిత్య జీవితంలో భౌతికశాస్త్రం చేతికి దొరికింది. ఆ తర్వాత అలాంటి పుస్తకాలు చదవడం కూడా ఒక పిచ్చిలాగా నడిచింది. అసలు నా చదువుకు ఏ మాత్రం సంబంధం లేని పరమాణుశక్తి అనే పుస్తకాన్ని తీసుకొచ్చి రాత్రంతా కూర్చుని చదవడమే కాదు, నోట్సు రాసుకుని పొద్దుట తీసుకెళ్ళి మళ్ళీ లైబ్రరీకి ఇచ్చాను.

ఈ పుస్తకాల పిచ్చి అప్పట్లో డిటెక్టివ్ పుస్తకాల వైపు కూడా మళ్ళించింది. లైబ్రరీలో డిటెక్టివ్ పుస్తకాలుండేవి కావు. మా ఊళ్ళోనే ఒక టీ కొట్టులో అద్దెకు దొరికేవి. రోజుకు పావల అద్దె. ఆ డిటెక్టివ్ పుస్తకం చదవడానికి గంట కూడా పట్టదు. ఆ తర్వాత అది మనకు వేస్టు. అప్పుడిచ్చిన పావలాయే ఇవ్వాలి లేకపోతే కొత్త పుస్తకం ఇవ్వడు. దీనికో భేషైన ఐడియా కనిపెట్టాం. డిటెక్టివ్ పుస్తకాల పిచ్చి ఉన్న నలుగురైదుగురు ఫ్రండ్స్ కలిసి ఒకేసారి పుస్తకాలు తీసుకునేవాళ్ళం. ఇక రోజంతా ఆ పుస్తకాలు సరిపోయేవి. ఇది భేషైన ఐడియా అని మేం అనుకున్నాం. కాని నిజానికి ఆ కొట్టు వాడికి రావలసిన డబ్బులు ఎలాగూ వచ్చేవి. ఒక్కొక్కడు పావలా లెక్కన ఇవ్వవలసిన డబ్బులు మొత్తం చెల్లించేవాళ్ళం. మా బిజినెస్సు అంత గ్రేటు మరి. ఇలాంటి మరో బిజినెస్సు కూడా హైస్కూలులోనే చేశాను. వెచ్చలామ్మే కొట్టులో రోజు ఈనాడు పేపరు వచ్చేది. పొద్దున్నే అక్కడ పదిమంది కూర్చుని పేపరు మొత్తం చదివేసేవారు. మధ్యాహ్నానికి పేపరు వేస్టయి పోయేది. నేను సగం డబ్బులిస్తాను మధ్యాహ్నం ఆ పేపరు నాకిచ్చేయ్ అని చెప్పాను. ఆయన సరే అన్నాడు. నేను స్కూలు, లైబ్రరీ అయిన తర్వాత రాత్రి చదువుకునేవాడిని. ఒక నెలరోజుల తర్వాత మళ్ళీ అదే కొట్టులో కిలోల లెక్కన పాత పేపర్లు అమ్మేవాడిని. ఇప్పుడు అదంతా తలచుకుంటే నవ్వు వస్తుంది.

డిటెక్టివ్ నవల్లో నేను మొదలు పెట్టింది మధుబాబుతో. ఆ పేరు సజెస్ట్ చేసింది కొట్టు వాడే. ఆయనవి చదువు బాగుంటాయి అన్నాడు. సీక్రెట్ ఏజంట్ షాడో, లైసెన్సుడు టు కిల్లు... వార్నాయనో... శవ సాహిత్యం అంటారు కాని చాలా కిక్కున్న సాహిత్యం. అసలు పఠనాభిలాష పెరిగిందంటే దానికి కారణం జానపద సాహిత్యమే. చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు పత్రికలే. కాశీమజిలీ కథలు, మహామాయ మజిలీలు, సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి, అరేబియన్ నైట్స్, పంచతంత్రం, భట్టీ విక్రమార్క కథలు వగైరా జానపద పుస్తకాలే. ఆ తర్వాత

రీడింగ్ స్పీడ్ రాకెట్ వేగాన్నందుకుందంటే దానికి కారణం డిటెక్టివ్ పుస్తకాలే. మధుబాబు నవలలు యాక్షన్ ప్రధానమైనవి. కాని కొమ్మూరి వంటి వారు రాసిన నవలల్లో అపరాధ పరిశోధన ప్రధానంగా ఉంటుంది. విశ్వప్రసాద్ మరో గొప్ప డిటెక్టివ్ రచయిత.

డిటెక్టివ్ పుస్తకాలు చదువుతున్నప్పుడు లైబ్రరీకి వెళ్ళడం మానేశామా అంటే అదేం లేదు. లైబ్రరీ టైము దానికే. అక్కడ కూర్చుని అక్కడ చదవవలసిన పుస్తకాలు అక్కడ చదవడం మామూలుగానే కొనసాగేది. డిటెక్టివ్ పుస్తకాలు స్కూలు పుస్తకాల మధ్యలో పెట్టుకుని స్కూల్లో చదివేవాడిని. స్కూలు పుస్తకాలు పరీక్షకు ముందు రాత్రి భట్టీ పట్టడం తప్ప ఆసక్తిగా చదివింది ఎప్పుడూ లేదు. అందుకే చివరకు చదివిందొకటి.. చేస్తుందొకటి అయ్యింది.

ఏది ఏమైనా నాలుగక్షరాలు నా నోట్లో పోసింది మా ఊరి లైబ్రరీయే...

గుండుగోలను లైబ్రరీ గురించి రాసిన తర్వాత ఇంకా రాయవలసింది చాలా ఉందనే అనిపిస్తోంది. ముఖ్యంగా వడ్డెర చండీదాస్ గురించి రాయకపోతే అసలు అధ్యయనం అసంపూర్ణమే. ఆయన రాసినవి రెండే నవలలు. నాకు తెలిసి. ఒకటి హిమజ్వాల, రెండవది అనుక్షణికం. హైస్కూలు వయసులో నాకెంతగా ఈ నవలలు అర్థమయ్యాయో చెప్పలేను కాని అప్పట్లో చాలా కాలం నన్ను వెంటాడిన పాత్రలు ఆ నవలలో ఉన్నాయి. ఆసక్తి ఉన్న మిత్రులు తప్పక చదవండి.

చాలా మంది రచయితల పేర్లు నేను ప్రస్తావించాను కాని చలం పేరు చెప్పలేదన్నది మీరు గమనించే ఉంటారు. చలం పుస్తకాలు మా లైబ్రరీలో లేవని కాదు. నేను హైస్కూలులో ఉన్న కాలం చలం పుస్తకాలు దాచుకుని చదివే కాలం ఏమీ కాదు. కాని చలాన్ని నేనప్పట్లో చదవలేదు. అదెందుకో కూడా కాస్త ఆసక్తికరమైన విషయం....

నేనెప్పుడు లైబ్రరీలోనే పడి ఉండేవాడిని కదా... అందువల్ల రోజూ లైబ్రరీకి వచ్చే వాళ్ళందరికీ నేను తెలిసిన వాడినే. అలాగే రెగ్యులర్ విజిటర్లందరూ నాకు తెలిసిన వాళ్ళే. ఒకరోజు ఒకమ్మాయి రిఫరెన్సు సెక్షను నుంచి బయటకు వస్తోంది. ఆమె చేతిలో చలం పుస్తకం ఉంది. నేను యథాలాపంగా ఆ పుస్తకం చదివావా అనడిగాను. ఆ అమ్మాయి నాకన్నా ఐదారేళ్ళు పెద్దమ్మాయి... లేదు రా... చదవాలి తీసుకెళుతున్నా అంది. చదివి బాగుంటే చెప్పు నేను కూడా చదువుతా అన్నాను. ఆ అమ్మాయి కాస్త నవ్వుకుంటూ, నువ్వు చలం పుస్తకాలు చదివావా అనడిగింది. లేదన్నాను... చదువు బాగుంటాయి అంది... నేను క్యాజువల్‌గా సర్లే అన్నా... ఆ అమ్మాయి ఏమనుకుందో... ర్యాకుల్లోంచి చలం మ్యూజింగ్స్ తెచ్చి నాకిచ్చింది. ఇది చదువు ముందు అని చెప్పింది. నేను సరే అన్నాను. అప్పుడు నా వయసు దృష్టిలో పెట్టుకుని, చలం పుస్తకాల్లో వీడికి ఇదే బెస్టు అనుకుందేమో తెలియదు. ఆ తర్వాత చలం మ్యూజింగ్స్ ముందేసుకు కూర్చున్నాను. మ్యూజింగ్స్ భాష కవితాత్మక వచనం. ఇప్పుడు చలం మ్యూజింగ్స్ గురించి మాట్లాడమంటే ఎంతైనా మాట్లాడగలను, కాని అప్పట్లో మ్యూజింగ్స్ సగం కూడా చదవలేకపోయాను. చలాన్ని అర్థం చేసుకోవాలంటే ఒక పరిణతి ఉండాలి. మనిషిలో పరిపక్వత ఉండాలి. ఆ రెండూ అప్పట్లో నాకు లేవు. సగం చదివాక... అబ్బే చలం మనకు ఫ్రెండ్ కాదని పక్కన పెట్టేశాను. ఆ తర్వాత మళ్ళీ చలం పుస్తకాలు హైస్కూలు లైఫ్ ముగిసేవరకు ఎప్పుడూ ముట్టుకోలేదు. ఎవరైనా చదవమని చెప్పినా సర్లే అని ఊరుకునే వాడిని.

పుస్తకాల గురించి ప్రస్తావిస్తున్నప్పుడు తప్పనిసరిగా చెప్పవలసిన మరో పుస్తకం మతాల మాయాబజారు. ఈశ్వరప్రభు రాసిన పుస్తకం. ఈ పుస్తకం నేను మా లైబ్రరీలో చదివానా లేక ఎవరైనా మిత్రుని వద్ద తీసుకుని చదివానా గుర్తులేదు. చదివింది అప్పట్లోనే. లైబ్రరీలో గోరా, తాపీధర్మారావు పుస్తకాలు ఉండేవి. కాని ఈశ్వరప్రభు పుస్తకాలు లైబ్రరీలో చూసిన గుర్తులేదు. ఈశ్వరప్రభు రాసిన ఇతర పుస్తకాలు తర్వాత చదివాను కాని మతాల మాయాబజారు అప్పట్లోనే చదివాను. మతాల మాయాబజారా లేక మతగ్రంథాల మాయాబజారా అనేది కాస్త డౌటు. కాని తప్పక చదవవలసిన పుస్తకం. మనం స్వంత మతవిశ్వాసాలు ఎలా ఉన్నప్పటికి ఒక గొప్ప తాత్విక చర్చ ఉన్న పుస్తకం.

పుస్తకం నిజానికి బుద్ధికి ఆహారం వంటిది. తిండి కలిగితే కండ కలిగెను, కండగలవాడే మనిషోయ్ అన్నాడు కదా గురజాడ. కండ కాస్త బుద్ధికి కూడా కావాలంటే బుద్ధికి తిండి పెట్టాలి. అది పుస్తకాలే. మనం ఎలాగూ మనం నమ్మిన మతవిశ్వాసాలను, సిద్ధాంతాలను వదిలిపెట్టం. ఒక నిబద్ధత మన లోపల ఎలాగూ ఉంటుంది. కాని ఇవన్నీ చదవడం వల్ల మన బుద్ధి విస్తరిస్తుంది. మన ఆలోచనలు బావిలో కప్పల్లా ఉండవు. మనం ఎలాగూ మనం పట్టిన కుందేటికి మూడే కాళ్ళంటాం. నాలుగో కాలు ఎప్పుడో మనం తినేశాం కాబట్టి అది మన పొట్టలో రహస్యసమాధి అయిపోయింది. అది బయటపడే ప్రసక్తి లేదు. కాని పుస్తకాలు చదవడం వల్ల ఆ నాలుగోకాలు జీర్ణమైందో లేదో తెలుస్తుంది.

# 'ఫిత్రా' పరమార్థం

**- మదీహా అర్జుమంద్**

**పవిత్ర** రమజాన్ మాసంలో ఆచరించబడే అనేక ఆరాధనల్లో 'ఫిత్రా' ఒకటి. ఫిత్రా అన్న పదం ఇఫ్తార్ నుండి వచ్చింది. ఫిత్ర్ అంటే శాబ్దిక అర్థం ఉపవాస విరమణ అన్నమాట. 'సదఖయే ఫిత్ర్' అంటే రోజా విరమణకు సంబంధించిన దానం అని అర్థం. ధర్మ శాస్త్ర పరిభాషలో 'సదఖయే ఫిత్ర్' అంటే ఉపవాస దీక్షలు పాటించేటప్పుడు జరిగిన లోపాలకు, పొరపాట్లకు పరిహారంగా రమజాన్ నెలలో విధిగా చెల్లించవలసిన దానం అన్నమాట. రోజాలు విధిగా నిర్ణయించిన నాటి నుండే ఫిత్రాలు కూడా తప్పనిసరిగా చెల్లించాలని ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఆదేశించారు.

ఆ కాలంలో ప్రజలు ముఖ్య ఆహారంగా వినియోగించే పదార్థాలనే పరిగణనలోకి తీసుకొని ఫిత్రాలు చెల్లించేవారు. హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(ర) ఇలా చెప్పారు: "ప్రవక్త వారి కాలంలో మేము ఈదుల్ ఫిత్ర్ (పండుగ) దానంగా ఒక 'సా' పరిమాణమంత పదార్థాలను ఇచ్చే వాళ్ళం. ఆ కాలంలో యవలు, ఎండుద్రాక్ష, ఖర్జూరం, జున్ను తదితరాలు ముఖ్య ఆహార పదార్థాలుగా ఉండేవి."

### 'సా' అంటే పావుతక్కువ రెండు శేర్లు

మారిన కాలాన్ని, నేటి పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ఏ రూపంలో అయినా ఫిత్రాలు చెల్లించవచ్చు. ఫిత్రాల వల్ల రెండు రకాల లాభాలున్నాయి. ఒకటి - రోజాలను ఎంత నిష్టగా పాటించినా, మానవ సహజ బలహీనత వల్ల ఏవో చిన్న చిన్న పొరపాట్లు జరుగుతూనే ఉంటాయి. వాటికి పరిహారంగా ఈ ఫిత్రాలు ఉపయోగపడతాయి. వీటి వల్ల రోజాలు పవిత్రతను, పరిపూర్ణతను సంతరించుకొని స్వీకార భాగ్యానికి నోచుకుంటాయి.

రెండు- ఫిత్రాల వల్ల సమాజంలోని పేద, బలహీన వర్గాలకు కాస్తంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. తద్వారా వారు కూడా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోగలుగుతారు. ఈ కారణంగానే ప్రవక్త మహనీయులు ఫిత్రా దానాన్ని 'తూమతుల్లిల్ మసాకీన్' అన్నారు. అంటే 'దీనులు, నిరుపేదల భృతి' అని అర్థం.

అందుకే ప్రవక్త మహనీయులు ఫిత్రా దానాలను ఉపవాసులకే పరిమితం చేయకుండా, ఈ పరిధిని విస్తరించారు. అంటే ఉపవాసం ఉన్నా లేకపోయినా అందరూ ఫిత్రా చెల్లించాలి. కుటుంబంలో ఎంత మంది ఉంటే, వారందరి తరపున కుటుంబ యజమాని ఫిత్రా చెల్లించాలి. పండుగ నమాజు కంటే ముందు జన్మించిన శిశువు తరపున కూడా తల్లిదండ్రులు ఫిత్రా చెల్లించాలి. పండుగ కంటే ముందే ఈ బాధ్యత నేరవేర్చుకోవాలి. కనీసం ఒక వారమో, మూడు నాలుగు రోజుల ముందో చెల్లిస్తే లబ్ధిదారులు పండుగ సామగ్రి కొనుక్కోవడానికి వీలుగా ఉంటుంది. పండుగ సంతోషంలో అందరినీ భాగస్వాములను చేయడమే గదా అసలు ఉద్దేశ్యం. ఆహార పదార్థాలు, వస్త్రాలు, నగదు ఏ రూపంలో అయినా ఫిత్రా చెల్లించవచ్చు.

కనుక పవిత్ర రమజాన్ మాసంలో చిత్తశుద్ధితో అన్ని రకాల ఆరాధనలు ఆచరిస్తూ, ఫిత్రాలను కూడా బాధ్యతాయుతంగా నెరవేర్చాలి. ఈ పవిత్ర నెలలో ఏదో ఒక రకంగా, ఎంతోకొంత ప్రయోజనం చేకూర్చి, తమ పరిధిలో కొందరి మోముపైనైనా చిరునవ్వులు చూడగలిగితే అంతకంటే మహా భాగ్యం ఇంకేముంటుంది. అల్లాహ్ అందరికీ రమజాన్‌ను సద్వినియోగం చేసుకునే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**